


# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర్ రెడ్డి మంగళవారం 02-08-2022 సంపుటి: 03 సంచిక: 302 పేజీలు: 4 వెల: రూ 3-00


## రానున్న మూడు రోజుల్లో ఏపీలో వర్షాలు



అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రానున్న మూడు రోజుల్లో వర్షాలు విరివిగా కురిసే అవకాశాలు ఉన్నాయి. ఈ మేరకు ఏపీలోని వాతావరణ పరిస్థితులకు సంబంధించి అమరావతి వాతావరణ కేంద్రం సోమవారం ఒక నివేదికను విడుదల చేసింది. ఆదివారం రోజున ఉత్తర-దక్షిణ ద్రోణి ఏర్పడి దక్షిణ ఛత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణ, రాయలసీమ, తమిళనాడు మీదుగా కొమరిన్ వరకు సరాసరి సముద్ర మట్టం 0.9గా ఉండటంతో రానున్న మూడు రోజులపాటు ఏపీలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఇది నిన్న రాయలసీమ, పరిసర ప్రాంతాల్లో సగటు సముద్ర మట్టానికి 1.5 కి.మీ ఎత్తులో, ఇవాళ కోస్తా తమిళనాడు, పరిసర ప్రాంతాలకు విస్తరించిందని పేర్కొన్నది.రానున్న మూడు రోజులపాటు ఉత్తర కోస్తా ఆంధ్ర, యానాంలో పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, కొన్ని చోట్ల ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉన్నది. దక్షిణ కోస్తా ఆంధ్రా ప్రాంతంలో ఒకటి రెండు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. రాయలసీమలో కూడా ఇదే పరిస్థితి ఉంటుందని, ఇవాళ కొన్నిచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు లేదా ఉరుములతో కూడిన వర్షాలు కురుస్తాయని, ఒకటి రెండు చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఇదే సమయంలో మరికొన్ని చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడే అవకాశం ఉన్నది. మంగళవారం నాడు పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉన్నదని, ఒకటి రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది.

## ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి: సీఎం జగన్ ఆదేశం


తాడేపల్లి: రాష్ట్రంలో ఇళ్ల నిర్మాణం పనులు వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. నవరత్నాలు- పెదలందరికి ఇంటి నిర్మాణం కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, విశాఖపట్నంలో ఇళ్ల పనులను వీలైనంత త్వరగా పూర్తిచేసి అందించాలని సూచించారు. జగనన్న కాలనీల్లో మౌలిక వసతులపై దృష్టి సారించాలన్నారు. తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో గృహనిర్మాణ శాఖ ఉన్నతాధికారులతో సీఎం జగన్ సోమవారం సమీక్ష జరిపి ఇళ్ల నిర్మాణం పనులను అడిగి తెలుసుకున్నారు.అన్ని రకాల పనులకు నిధులు సక్రమంగా విడుదలవుతున్నాయని, త్వరగా బిల్లులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను జగన్ ఆదేశించారు. విశాఖలో 1.24 లక్షల ఇళ్ల నిర్మాణ పనులకు అన్ని రకాలుగా సన్నాహాలు చేస్తున్నామని, అక్టోబర్ నెలాఖరుకల్లా ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. ఆప్షన్ త్రీ కింద ఎంపిక చేసిన ఇళ్ల నిర్మాణాలు కూడా శరవేగంగా జరుగుతున్నాయని, కాలనీల్లో జరుగుతున్న పనుల పురోగతిని సమీక్షించేందుకు, సందేహాలను నివృత్తి చేసేందుకు అక్కడి నుంచి వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం ఏర్పాటు



చేశామని అధికారులు సీఎం జగన్‌కు వివరించారు.15-20 రోజుల్లో మొత్తం 1.4 లక్షల ఇళ్లు సిద్ధమవుతాయని అధికారులు తెలిపిన టిడ్కో ఇళ్ల నిర్మాణంపై కూడా సీఎం జగన్ చర్చించారు. లబ్దిదారులకు పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించి, రిజిస్ట్రేషన్ ప్రక్రియను చేపట్టాలని ఆదేశించారు అలాగే 90 రోజుల్లో ఇంటి స్థలం పట్టాల కార్యక్రమాన్ని కూడా ఆయన సమీక్షించారు. వచ్చిన దరఖాస్తులను పరిష్కరించి 2,03, 920 మందిని అర్హులుగా గుర్తించినట్లు అధికారులు చెప్పారు. ఇప్పటికే లక్షల మందికి పట్టాలు ఇచ్చామని, మిగిలిన వారికి అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. సమీక్షకు ఏపీఎస్‌హెచ్‌సీఎల్ చైర్మన్ డీ దొరబాబు, సీఎస్ సమీర్ శర్మ, గృహనిర్మాణ శాఖ స్పెషల్ సీఎస్ అజయ్ జైన్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణాభివృద్ధి శాఖ స్పెషల్ సీఎస్ వై శ్రీలక్ష్మి, ఇంధన శాఖ స్పెషల్ సీఎస్‌కే విజయ్ ఆనంద్, ఏపీ టిడ్కో ఎండీ సీహెచ్ శ్రీధర్, ఏపీఎస్‌హెచ్‌సీఎల్ ఎండీ ఎన్‌సీసీఎల్ భరత్ గుప్తా, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## 16,464 కరోనా కేసులు

న్యూఢిల్లీ: దేశంలో కరోనా కేసులు తగ్గాయి. ఆదివారం 19,673 కేసులు నమోదవగా, తాజాగా ఆ సంఖ్య 16,464కు తగ్గింది. దీంతో మొత్తం కేసులు 4,40,36,275కు చేరాయి. ఇందులో 4,33,65,890 మంది బాధితులు కోలుకున్నారు. ఇప్పటివరకు 5,26,396 మంది మరణించారు. మరో 1,43,989 కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. కాగా, ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు మరో 39 మంది




ప్రాణాలు కోల్పోయారు. 16,112 మంది కరోనా నుంచి కోలుకున్నారు.మొత్తం కేసుల్లో 0.33 శాతం కేసులు యాక్టివ్‌గా ఉన్నాయని కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. రికవరీ రేటు 98.48 శాతంగా, మరణాల రేటు 1.20 శాతంగా ఉందని తెలిపింది. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 204.34 కోట్ల కరోనా వ్యాక్సిన్ డోసులను పంపిణీ చేశామని పేర్కొన్నది.

## 'కృష్ణా మిగులు జలాల్లో ఏపీ, తెలంగాణ వాటాలు తేలుస్తాం



ఢిల్లీ: కృష్ణా నది మిగులు జలాల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య వాటాలను నిర్ధారించే అంశం కృష్ణా రివర్ మేనేజ్మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ) పరిశీలనలో ఉందని జల శక్తి మంత్రి బిశ్వేశ్వర్ తుడు వెల్లడించారు. రాజ్యసభలో సోమవారం వైఎస్సార్సీపీ సభ్యులు విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి రాతపూర్వకంగా జవాబిస్తూ కృష్ణా బేసిన్లోని ప్రాజెక్టులలో 75 శాతం నికర జలాలకు మించి ప్రవహించే మిగులు జలాలను రెండు రాష్ట్రాల మధ్య పంపిణీ చేసేందుకు నిర్దుష్టమైన విధానం రూపకల్పన చేసే బాధ్యతను కేఆర్ఎంబీ రివర్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఆర్ఎంసీ)కి అప్పగించినట్లు తెలిపారు.వర్షా కాలంలో కృష్ణా నదిపై ఉన్న ప్రధాన ప్రాజెక్టుల నుంచి విడుదలయ్యే మిగులు జలాలను ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు నియంత్రిత పద్ధతిలో పంపిణీ చేసేందుకు కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ)కు చెందిన సాంకేతిక సంఘాన్ని తమ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిందని మంత్రి చెప్పారు. అయితే ఉభయ రాష్ట్రాలు దీనికి సంబంధించిన అవసరమైన సమాచారం సమర్పించకపోవడంతో సాంకేతిక సంఘం తనకు అప్పగించిన బాధ్యతను పూర్తి చేయలేకపోయిందని ఆయన పేర్కొన్నారు. ఒక నీటి సంవత్సరంలో కృష్ణా నదిలో లభించే మిగులు జలాలను వినియోగించుకునే స్వేచ్ఛను బచావత్ ట్రైబ్యునల్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కల్పించింది. మిగులు జలాల వినియోగం తప్ప వాటిపై ఆంధ్రప్రదేశ్‌కు హక్కు ఉండబోదని ట్రైబ్యునల్ స్పష్టం చేసింది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం అమలులోకి వచ్చిన తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలుగా ఏర్పడిన నేపథ్యంలో కృష్ణా జలాలను రెండు రాష్ట్రాల మధ్య ప్రాజెక్టుల వారీగా కేటాయింపులు చేసేందుకు కృష్ణా జలాల వివాద పరిష్కార ట్రైబ్యునల్ కాలపరిమితిని పొడిగించడం జరిగిందని మంత్రి వివరించారు.

## పల్నాడులో మంత్రి అంబటిని నిలదీసిన గ్రామస్థులు

అమరావతి : పల్నాడు జిల్లా రాజుపాలెంలో ఏపీ జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబుకు ప్రజల నుంచి నిరసన ఎదురైంది. గడప గడపకు ప్రభుత్వం పేరిట నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా ఇవాళ మంత్రి గ్రామంలో పర్యటిస్తున్నారు. దీంట్లో భాగంగా రాజుపాలెంలో తనకు పింఛన్ రావడం లేదని దివ్యాంగురాలు మంత్రిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగు విద్యుత్ మీటర్లు ఉండడంతో పింఛన్ ఇవ్వలేదని అధికారులు మంత్రికి వివరించే ప్రయత్నం చేశారు.బుల్లబ్బాయి అనే వ్యక్తి మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వం ఏమీ చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలపై స్థానికులు నిలదీయడంతో మంత్రి అక్కడి నుంచి వెనుతిరిగారు. ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతను చిత్రీకరించిన మీడియా వద్ద




నుంచి సెల్‌ఫోన్లను మంత్రి అంబటి పీఏ లాక్కొని వాటిని తొలగించారు.

## కాంగ్రెస్ నేత ఫేరోజ్ ఖాన్ ఇంట విషాదం..

### రోడ్డుప్రమాదంలో కూతురు దుర్మరణం

హైదరాబాద్, ఆగస్టు 1 కాంగ్రెస్ నేత ఫేరోజ్ ఖాన్ ఇంట విషాదం చోటుచేసుకుంది. రోడ్డుప్రమాదంలో కూతురు దుర్మరణం చెందింది. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని సాతంరాయి వద్ద బెంగళూరు-హైదరాబాద్ జాతీయ



రహదారిపై కారు డివైడర్ ను ఢీకొట్టంది. కారులో ఫేరోజ్ ఖాన్ కూతురుతో పాటు మరో నలుగురు ప్రయాణిస్తున్నారు. ఈ ప్రమాదంలో ఫేరోజ్ ఖాన్‌కుమార్తె తఖియాఖాన్ అక్కడికక్కడేమృతిచెందగా..మరోముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్నపోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాయాలైన వారిని హుటాహు టిన ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. శంషాబాద్ వైపు నుండి హైదరాబాద్ వస్తుండగా సాతంరాయి అపర్ణా సర్కిల్ వద్దకు రాగానే అదుపుతప్పిన కారు డివైడర్ ను డికొట్టడంతో ఈ ప్రమాదంచోటుచేసుకుంది.కారులోతఖియా ఖాన్ తో పాటు మరో ఇద్దరు ఫ్రెండ్స్ కూడా వున్నారు.వారుఇరానీకిచెందినవాళ్ళుగాపోలీసులుగుర్తించారు. శంషాబాద్‌లో జరిగిన ఓపార్టీకిహాజరైతిరిగు ప్రయాణం లో ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. ఆమెమృతదేహాన్నిఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎయిర్‌పోర్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## అసెంబ్లీ స్థానాలపైనే పవన్ గురి

విజయవాడ, ఆగస్టు 1 వచ్చే ఎన్నికల్లోనూ ఏ పార్టీకైనా పార్లమెంటు సీట్లు కీలకం. అవి ఉంటేనే ఢిల్లీలో కొంత గౌరవం లభిస్తుంది. పలకరించే వారుంటారు. లేకపోతే పట్టించుకునే వారే లేరు. ఇప్పుడు టీడీపీ అధినేత చంద్రబాబు ఢిల్లీలో కాలు మోపలేకపోవడానికి మూడు సీట్లు రావడమే కారణం. అయితే జనసేన లాంటి పార్టీలకు కేంద్రం నుంచి సహకారం కావాలన్నా, ఢిల్లీ స్థాయిలో గుర్తింపు రావాలన్నా పార్లమెంటు స్థానాల్లో గెలుపు అవసరం. అయితే ఇప్పటి వరకూ జనసేన ఆ దిశగా దృష్టి పెట్టినట్లు కన్పించడం లేదు.



కేవలం కొన్ని జిల్లాల్లోనే అదీ శాసనసభ నియోజకవర్గాలపైనే పవన్ ఫోకస్ పెట్టారు. అంతే తప్ప అసలు పార్లమెంటు స్థానాల గురించి పట్టించుకోవడం లేదు. వచ్చే ఎన్నికల్లో బీజేపీతో కాని, టీడీపీతో కాని పొత్తు పెట్టుకోవాలనుకున్నా పార్లమెంటు స్థానాలకు సరైన అభ్యర్థులు అవసరం. కానీ ఆ దిశగా జనసేనాని ఆలోచించడం లేదు. ఇంకా రెండేళ్లు సమయం ఉందని పెద్దగా పట్టించుకోవడం లేదా? అసలు పార్లమెంటు నియోజకవర్గాలు తమకు అవసరం లేదా? అన్నది క్యాడర్ కు కూడా అర్థం కాకుండా ఉంది. సహజంగా పార్లమెంటుకు పోటీ చేసే నేతలు ఆర్థికంగా బలవంతులై ఉంటారు. రిజర్వడ్ నియోజకవర్గాలను మినహాయిస్తే మిగిలిన అన్ని నియోజకవర్గాల్లో ఆ పార్లమెంటు పరిధిలోని శాసనసభ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులకు అంతో ఇంతో ఆర్థికంగా ఆదుకోవాల్సి ఉంటుంది. ఏ పార్టీ కూడా పార్లమెంటుకు పోటీ చేసే అభ్యర్థులకు ఆర్థిక సహకారం అందించదు.ఇక సామాజికవర్గం కూడా కొంత పనిచేస్తుంది. జనసేనకు కాకినాడ, అనకాపల్లి, నరసాపురం లాంటి రెండు మూడు మినహా మరెక్కడా అవకాశాలు కన్పించడం లేదు. ఒక వేళ టీడీపీతో పొత్తు పెట్టుకున్నా ఈ మూడింటిలో నరసాపురం తప్ప మరెక్కడా తెలుగుదేశం పార్టీ అవకాశం ఇవ్వదు. ఎందుకంటే దానికి కూడా ఎంపీలు అధిక స్థాయిలో గెలవడం అవసరం. ఇక రాజంపేట పార్లమెంటు పరిధిలో బలిజ సామాజికవర్గం బలంగా ఉంది. కానీ ఇప్పటికే అక్కడ ప్రముఖ పారిశ్రామికవేత్త గంటా నరహరిని చంద్రబాబు ముందుగానే అభ్యర్థిగా ప్రకటించేశారు. రెండేళ్ల నుంచే ఆయన నియోజకవర్గాల్లో తిరిగి పార్టీకి ఖర్చు చేస్తాడన్నది చంద్రబాబు ఆలోచన. పార్టీ బలోపేతం కావడానికి కొంత ఉపయోగపడుతుంది. అసలు అభ్యర్థులేరీ? అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపోటములు పక్కన పెడితే, కనీసం కొన్ని పార్లమెంటు స్థానాల్లోనైనా గెలిస్తే ఢిల్లీలో పట్టు దొరుకుతుంది. కానీ పవన్ కల్యాణ్ అటువంటి ప్రయత్నమే చేయడం లేదు. ఇటీవల ఒక జాతీయ మీడియా సంస్థ జరిపిన సర్వేలోనూ జనసేనకు ఒక్క సీటు కూడా రాదని తేల్చింది. టీడీపీకి ఆరు, వైసీపీకి 19 స్థానాలు దక్కుతాయని సర్వే అంచనా వేసింది. సర్వే సంగతి పక్కన పెట్టినా మనోడు అసలు పార్లమెంటు నియోజకవర్గాలపై దృష్టి పెట్టిందెన్నడు? అన్న కామెంట్స్ పార్టీ వర్గాల నుంచే వినిపిస్తున్నాయి.

## నందమూరి ఇంట విషాదం, ఉమా మహేశ్వరి ఆత్మహత్య

హైదరాబాద్: నందమూరి ఇంట తీవ్ర విషాదం చోటు చేసుకుంది. దివంగత నటుడు నందమూరి తారక రామారావు కూతురు కంఠమనేని ఉమా మహేశ్వరి (52) ఆత్మహత్య చేసుకున్నారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో సోమవారం ఉదయం ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ప్రాణాలు తీసుకున్నారు. ఆమె మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.మానసిక ఒత్తిడి, అనారోగ్య సమస్యలతో ఆమె ఉరేసుకున్నట్లు తెలుస్తోంది. ఉమా మహేశ్వరి మృతితో ఎన్టీఆర్ కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోగా ఆమె మృతి పట్ల పలువురు ప్రముఖులు సంతాపం తెలుపుతున్నారు. కాగా ఉమా మహేశ్వరి.. సీనియర్ ఎన్టీఆర్ నాలుగో కూతురు. ఇటీవలే ఆమె కూతురి వివాహం ఘనంగా జరిగింది.



# సంపాదకీయం

మంగళవారం 02-08-2022

## ఏపీలో ముందస్తు ఎన్నికల ఫీవర్

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీకి ముందస్తు ఎన్నికలకు వేళాయిన సూచనలే కనిపిస్తున్నాయి. కొద్ది రోజులుగా అధికార వైసీపీ, ప్రతిపక్ష టీడీపీ నాయకులు, అధినాయకుల తీరును గమనిస్తే ముందస్తు ఎన్నికలు ఖాయమన్న భావనే కలుగుతోందని పరిశీలకులు అంటున్నారు. బాదుడే.. బాదుడుతో టీడీపీ నేతల కార్యక్రమాలు, జిల్లాల పర్యటలో చంద్రబాబు, రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్రకు ఉపక్రమిస్తున్న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్.. వైసీపీ అధినేత సీఎం పర్యటనలు, జనం నాడిని కనిపెట్టేందుకు ఆయన సర్వేలు చేయించుకుంటున్న తీరు, వైసీపీ జిల్లాల సమన్వయకర్తలు, నేతలతో భేటీలు నిర్వహిస్తున్న వైనం. గడప గడపకు మన ప్రభుత్వం పేరుతో ఎమ్మెల్యేలు, మంత్రులను గ్రామాలకు తరుముతున్న తీరు, మధ్యలో అప్పుడప్పుడూ నేనున్నానంటూ ప్రజల మధ్యకు వస్తున్న జనసేన అధినేత పవన్ కళ్యాణ్. అధికార– విపక్షాల మధ్య హోరాహోరీగా కొనసాగుతున్న మాటల యుద్ధాలు.. ఇవన్నీ ముందస్తు ఎన్నికలకు ముందస్తు సంకేతాలుగానే రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. వీటన్నింటికీ తోడు తాజాగా ఏపీలో సంభవించిన భారీ వర్షాలు, ఆపైన గ్రామాలకు గ్రామాలను ముంచెత్తిన వరదలు.. వరద బాధితులకు మేం ఇంత చేశాం.. అంత చేశామని చెప్పుకుంటున్న అధికారపక్షం.. అంతలేదు.. అసలు బాధితులకు సాయమే లేదు.. వారిని ప్రభుత్వం తరపున పట్టించుకున్న నాథుడే లేడంటూ తూర్పారపడుతున్న టీడీపీ అధినేత సహా ఆ పార్టీ నాయకులు. ఇవన్నీ ముందస్తు ఎన్నికలకు ఆయా పార్టీల సన్నాహాలుగానే విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఏపీలో ముందస్తు రాజకీయ సునామీ వచ్చిందా? అన్నట్లు అధికార, ప్రతిపక్ష నేతలిద్దరి నోటా ఒకే సారి ఎన్నికల మాట వినిపించడం విశేషం. అంటే రోగి కోరుకున్నదే వైద్యుడు చేశాడన్నట్లు.. ముందస్తు ఎన్నికలకు ప్రతిపక్షం తాను రెఢీ అంటూ కాలుదువ్వుతుంటే.. మేం తక్కువ తిన్నానా? అనే ధోరణిలో వైసీపీ కూడా విపక్షానికి సవాళ్లు విసురుతోంది. చంద్రబాబు కోసం జనసేనాని పవన్ కళ్యాణ్ కాపులను అమ్మేస్తున్నారంటూ జగన్ వ్యాఖ్యానించడం రాజీకీయ వర్గాల్లో దుమారం రేపుతోంది. అంటే.. కాపు సామాజికవర్గం ఓట్లన్నీ గంపగుత్తగా పవన్ కళ్యాణ్ వైపు మొగ్గు చూపుతున్నాయనేలా జగన్ వ్యాఖ్యలు ఉన్నాయంటున్నారు. జగన్ వ్యాఖ్యతో ఏపీ రాజకీయం ఒక్కసారిగి హీటెక్కిపోయింది. తానేమన్నా తక్కువా అంటూ.. చంద్రబాబు కూడా 'ఏపీలో ఫ్యాన్ ను నిలిపేయాలం టూ ప్రజలకు పిలుపునివ్వడం గమనార్హం. ఇరు పార్టీల అధినేత నుంచీ ఎన్నికల ప్రస్తావన వచ్చింది. ఇప్పుడు ఎన్నికలు నిర్ణీత సమయంలో వచ్చినా.. ముందుగానే వచ్చినా.. తమకు ఎవరు కావాలో తేల్చుకోవాల్సిన సమయం మాత్రం ఏపీ ఓటర్లకు వచ్చిందనడంలో సందేహం లేదు. ప్రజాధనాన్ని తినేవాళ్లు కావాలో.. ప్రజాధనాన్ని ప్రజలకే పంచేవాళ్లు కావాలో.. తేల్చుకోండి అని ప్రజలకు సీఎం జగన్ పిలుపునివ్వడం కచ్చితంగా ముందస్తు ఎన్నికలకు సన్నాహక సూచనగానే భావించాలని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. చంద్రబాబు మాట్లలు కూడా అచ్చంగా ఎన్నికల సమయంలో చెప్పిన తీరునే గుర్తుచేస్తున్నాయంటున్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఫ్యాన్ ఆగిపోయిన విధంగానే.. ఎన్నికల్లో ఆ ఫ్యాన్ ను తిరగనివ్వకుండా చేయాలని పిలుపునివ్వడం గమనార్హం. అటు జగన్.. ఇటు చంద్రబాబు ఇద్దిరి నోటా వాడి వేడి గా ఒకేసారి వ్యాఖ్యలు రావడాన్ని ముందస్తు ఎన్నికలకు సంకేతంగానే భావిస్తున్నారు. ఒక పక్కన జగన్ తన పాలనను చంద్రబాబు పాలనతో పోల్చి చెప్పుకుంటున్నారు. ప్రకృతి విలయాలు వచ్చిన సందర్భంలో తాను జీఓ9 తెచ్చి బాధితులకు పెద్ద ఎత్తున నిధులు అందించేలా చేసిన వైనాన్ని గుర్తుచేస్తున్నారు. చంద్రబాబు కూడా తమ ఇద్దరి పాలనా విధానాలను పోల్చి చెబుతున్నారు. పోలవరం ప్రాజెక్టు ముంపు ప్రాంతాల నిర్వాసితులకు పరిహారం విషయంలో కేంద్రం డబ్బులివ్వడం లేదని బాధితుల ముందు జగన్ చెప్పుకుంటే.. కేంద్రం నుంచి నిధులు ఎందుకు రావో తేల్చుకుంటామంటూ చంద్రబాబు సవాల్ చేస్తున్నారు. పోలవరం ముంపు గ్రామాల వారిని జగన్ గాలికి వదిలేశారని, టీడీపీ అధికారంలోకి రాగానే ఆ మండలాలన్నీ కలిపి ఒక జిల్లాగా ఏర్పాటు చేస్తామంటూ చంద్రబాబు ఎన్నికల హామీగా బాధితులకు చెప్పడం విశేషం. వరద పీడిత కోనసీమ, పశ్చిమ గోదావరి, అల్లూరి సీతారామరాజు, ఏలూరు జిల్లాల్లో ప్రతిపక్ష నేత చంద్రబాబు ముందుగానే పర్యటించారు. కష్టాల్లో ఉన్న బాధితులకు మనో ధైర్యం ఇచ్చారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఇక జగన్ వరద ముంపు ప్రాంతాల్లో ఏరియల్ సర్వే చేసి వెళ్లారు. పనిలో పనిగా.. వచ్చే ఎన్నికల్లో .. అవి సాధారణంగా వచ్చేవైనా.. ముందుగా జరిగేవైనా.. వైసీపీకి 175 స్థానాలూ గెలుచుకుంటుందని, అలా గెలిచేలా చేయాలంటూ తమ పార్టీ నేతలను జగన్ పురమాయిస్తున్నారు. మరో పక్కన ప్రజల నాడి ఏ రకంగా ఉందో తెలుసుకునేందుకు రకరకాల సర్వేలు కూడా చేయించుకుంటున్నారు. ఆ సర్వేల ఇస్తున్న నివేదికల సారాంశంతో ఏయే నియోజకవర్గాల్లో వైసీపీకి అనుకూలత ఉందో.. ఎక్కడ ప్రతికూలత ఉందో జగన్ అంచనా వేసుకుంటున్నారు. ప్రతికూలత ఉన్న చోట్ల తమ పార్టీ నేతలకు టార్గెట్లు పెట్టి మరీ జనంలోకి తరుముతున్నారు. అనుభవ రాహిత్యంతో ఏపీని ఇబ్బందుల్లోకి, అభివృద్ధి లేకుండా దశాబ్దాల వెనక్కి నెట్టేసిన ప్రస్తుత ప్రభుత్వం పట్ల జనంలో వ్యతిరేకత పెరిగిన మాట వాస్తవం అంటున్నారు. ఇదే వ్యతిరేకత మరింత పెరిగిపోతే మొదలుకే మోసం వస్తుందనే భయం పట్టుకున్న జగన్ మరింతగా డ్యామేజ్ కాక ముందే ముందస్తు ఎన్నికలను ఎంచుకుంటారనే అంచనాకు విశ్లేషకులు వస్తున్నారు. ఈ అన్నింటినీ బేరీజు వేసుకుంటే ఏపీలో ముందస్తు ఎన్నికలు తథ్యం అనే అంచనాలే సర్వత్రా వస్తున్నాయి. వచ్చే ఎన్నికల్లో గెలుపోటములు ఎవరిని వరించినా.. ఏపీని ఇప్పటి నుంచే ఎన్నికల ఫీవర్ పట్టుకుందంటున్నారు.

# కేశినేని నాని స్థానంలో....



విజయవాడ, ఆగస్టు 1 , తెలుగుదేశం పార్టీ విజయవాడ పార్లమెంటు స్థానానికి అభ్యర్థి దొరికేశాడు. ఆయన రాజకీయాలకు కొత్తేమీ కాకపోయినా ఆ వాసనలు మాత్రం ఉన్నాయి. బలమైన సామాజికవర్గంతో పాటు ఆర్థికంగా బలమైన వ్యక్తి కావడంతో చంద్రబాబు ఆయన పేరును దాదాపు ఖరారు చేశారంటున్నారు. ప్రస్తుత విజయవాడ పార్లమెంటు సభ్యుడు కేశినేని నాని వచ్చే ఎన్నికల్లో పోటీ చేసేది లేదని క్లారిటీ ఇచ్చారు. ఆయన సోదరుడిని ఎంపిక చేసినా రాజకీయంగా ఇబ్బందులు ఎదురవుతాయి. ఖచ్చితంగా గెలిచే స్థానం. అందుకే ఈసారి పోటీకి ఆయనను పార్లమెంటు సభ్యుడిగా దింపాలని చంద్రబాబు డిసైడ్ అయ్యారన్నది పార్టీ వర్గాల నుంచి వినిపిస్తున్న సమాచారం. కేశినేని నాని రెండు దఫాలు టీడీపీ నుంచి విజయం సాధించారు. వరస విజయాలు వెనక ఆయన కన్నా పార్టీకున్న ఓటు బ్యాంకే కారణమని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. అయితే వ్యాపారాలన్నీ మూసివేసుకున్న తర్వాత కేశినేని నాని ఫక్తు రాజకీయ నేతగా మారారు గతంలో వడ్డే శోభనాద్రీశ్వరరావు, గద్దె రామ్మోహన్ లాంటి వంటి వారు ఉన్నా కృష్ణా జిల్లాలో ఎలాంటి రాజకీయ ఇబ్బందులు తలెత్తలేదు. వారు అందరినీ కలుపుకుని పోయేవారు. కానీ కేశినేని నానిని దాదాపు ఎక్కువ మంది నేతలు వ్యతిరేకిస్తున్నారు. ఆయన వల్ల అనేక శాసనసభ నియోజకవర్గాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటుంది. గ్రూపులుగా తయారైంది. దీంతో చంద్రబాబు వచ్చే ఎన్నికల్లో కేశినేని నానిని తప్పించాలని ఎప్పుడో నిర్ణయించుకున్నారు. అందుకు అనుగుణంగానే నానిని అసహనానికి గురయ్యేటట్లు చేశారు. పార్టీ నాయకత్వం అందులో సక్సెస్ అయిందనే చెప్పాలి. కేశినేని నాని స్వచ్ఛందంగా తప్పుకుంటే విజయవాడలో పార్లమెంటు అభ్యర్థులకు కొదవ లేదు. టీడీపీకి అనుకూలంగా ఉన్న అనేక మంది పారిశ్రామికవేత్తలు పోటీ పడతారు. గెలిచే సీటు కావడంతో సహజంగానే ముందుకు వస్తారు. అయితే ఈసారి ఎవరికీ ఇబ్బందిలేని నేతను ఎంపిక చేయాలని చంద్రబాబు భావిస్తున్నారు. పెద్దగా పార్లమెంటు నియోజకవర్గాన్ని పట్టించుకోక పోయినా పరవాలేదు కాని, ఎమ్మెల్యేలను ఇబ్బంది పెట్టే ఉండకూడదన్నది చంద్రబాబు ఆలోచన. అందుకే సినీ నిర్మాత చలసాని అశ్వనిదత్ పేరును చంద్రబాబు ఖరారు చేసినట్లు తెలిసింది. 2004లో అశ్వినీదత్ విజయవాడ పార్లమెంటులో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి లగడపాటి రాజగోపాల్ పై పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అప్పటి నుంచి పార్టీలో యాక్టివ్ గా లేకపోయినా టీడీపీకి బలమైన సానుభూతివరుడు. సామాజికవర్గం కూడాకలసివస్తుంది. అదేసమయంలోఆర్థికంగాఏడు నియోజకవర్గాల అభ్యర్థులను ఆదుకునే సత్తా ఉన్న వ్యక్తి. అందుకే ఇటీవల అశ్వినీదత్ వైసీపీ ప్రభుత్వంపై బహిరంగంగా విమర్శలకు దిగుతున్నారంటు న్నారు. సినీ పరిశ్రమలో ఉండి రెండేళ్లకు ముందే అధికార పార్టీపై విమర్శలుచేస్తున్నారంటే దత్తుగారికి చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారంటున్నారు. మొత్తంమీదబెజవాడ ఎంపీ అభ్యర్థిగా అశ్వీనీదత్ పేరునుఖరారుచేసినట్లుపార్టీవర్గాల నుంచి అందుతున్న సమాచారం.

# అధికార పార్టీ నేతల మధ్య వార్

నెల్లూరు, ఆగస్టు 1, ( కయ్యాలు.. కవ్వింపులు. ఆ నియోజకవర్గంలో అధికార పార్టీ నేతల మధ్య ప్రస్తుతం ఇదే సీన్. ఒకరేమో డిప్యూటీ సీఎం.. ఇంకొకరేమో ప్రభుత్వ సలహాదారు. ఇద్దరి మధ్య ఉప్పు నిప్పులా ఉంది యవ్వారం. మొన్నటి వరకు కేడర్ తిట్టుకుంటే.. ఇప్పుడు ముఖ్య నేతల వంతు వచ్చింది. ఈయన నారాయణస్వామి. ఏపీ డిప్యూటీ సీఎం. ఈయనేమో.. ప్రభుత్వ ఎన్ఆర్ఐ సలహాదారు, మాజీ ఎంపీ మహాసముద్రం జ్ఞానేంద్రరెడ్డి. ఇద్దరూ అధికార వైసీపీ నాయకులే. కానీ ఒకరంటే ఒకరికి పడటం లేదు. ఛాన్స్ దొరికితే కయ్‌మంటున్నారు. నోటికి పనిచెప్పడంలో తగ్గేదే లేదన్నట్టుగా ఉంటున్నాయి వాళ్ల మధ్య విమర్శల బాణాలు. అప్పట్లో విభేదాలను తేలికగా తీసుకున్నా.. ఇటీవల అవి శ్రుతిమించినట్టు చెబుతున్నారు. నారాయణస్వామి గతంలో మూడుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన సమయంలో పెద్దగా చర్చల్లో లేరు. డిప్యూటీ సీఎం అయ్యాక మాత్రం తరచూ వార్తల్లో ఉంటున్నారు. ప్రజల అటెన్షన్ కోరుకుంటున్నారో ఏమో.. నారాయణ స్వామి ఏదో విధంగా వివాదాల్లోకి వస్తున్నారు కూడా. చిత్తూరు జిల్లాలో గ్రూపు పాలిటిక్స్ డోస్ ఎక్కువే అయినా.. గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో అవి తారాస్థాయికి చేరాయి. గంగాధర నెల్లూరు, పెనుమూరు, వెదురుకుప్పం, ఎస్ఆర్ పురం, కార్వేటి నగరం మండలాల్లో తెల్లారి లేస్తే చాలు వైసీపీలో గ్రూపు రాజకీయాలు సెగలు రేపుతున్నాయి. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమలంలో భాగంగా జనాల్లోకి నారాయణ స్వామి వెళ్తున్నా.. స్థానిక వైసీపీ నేతలు ఆయనకు సహకరించడం లేదట. దాంతో తూతూ మంత్రంగా పని కానిచ్చేస్తున్నారు. కొన్ని మండలాల్లో అయితే నేతల మధ్య వాగ్యుద్ధం సాధారణమైపోయింది. జనాల సంగతేమోకానీ.. సొంత పార్టీ నాయకులనే డిప్యూటీ సీఎంను నడిరోడ్డుపై నిలదీస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. నియోజకవర్గంలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి వర్గానికి.. ప్రభుత్వ ఔఖీఏ సలహాదారు మహాసముద్రం జ్ఞానేంద్రరెడ్డి వర్గానికి మొదటి నుంచి పడటం లేదు. ఆ విభేదాలు క్షేత్రస్థాయిలో ఏదో ఒక రూపంలో బయట పడుతూనే ఉన్నాయి. తాజాగా మండల కమిటీ అధ్యక్షుల నియామకంతో ముఖ్య నేతలే తిట్టుకుంటున్న పరిస్థితి ఉంది. పెనుమూరు మండల వైసీపీ అధ్యక్షుడిగా విజయకుమార్‌రెడ్డిని నియమించారు. ఇది జ్ఞానేంద్రరెడ్డి సొంత మండలం. తన సమీప బంధువు సురేష్‌రెడ్డికి పార్టీ పదవి ఇప్పించుకోవాలని చూశారట. ఆ ప్రయత్నాలకు నారాయణస్వామి చెక్ పెట్టినట్టు టాక్. రెండు వర్గాలు ప్రస్తుతం కత్తులు దూసుకుంటున్నాయి. జ్ఞానేంద్రరెడ్డి వర్గానికి చెందిన దేవరాజులరెడ్డి, డిప్యూటీ సీఎం నారాయణస్వామి అనుచరుడు ఒంఅ మాజీ ఛైర్మన్ కండిగ మధురెడ్డిల మధ్య తిట్లు ఓ రేంజ్‌లో సాగాయి. ఆ ఆడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ప్రధాన నేతల మధ్య నెలకొన్న విభేదాల తీవ్రత అందరికీ తెలిసింది. మండల కమిటీలను మార్చే ప్రసక్తే లేదని నారాయణస్వామి చెబుతున్నారట. దానికి జ్ఞానేంద్రరెడ్డి గుర్రుగా ఉ న్నట్టు సమాచారం. ఈ పంచాయితీ జిల్లా వరకే ఆగుతుందో.. తాడేపల్లి వరకు వెళ్తుందో కానీ.. నేతల పట్టు చూస్తుంటే మాత్రం అగ్గి గట్టిగానే రాజుకుంటోంది. మరి.. ఏం జరుగుతుందో చూడాలి.

# రావెల.. వెలవెల



గుంటూరు, ఆగస్టు 1, ఆఫీసర్ పాత్ర నుంచి రాజకీయాల్లోకి వచ్చీరావడంతోనే మంత్రి అయ్యారు. తర్వాత అడుగులు తడబడి.. పొలిటికల్ తెరపై ఫేడ్ అవుట్ అయ్యారు ఆ మాజీ మంత్రి. ఎన్నో ఆశలతో సొంత గూటికి తిరిగి వెళ్దామని అనుకున్నా.. బ్రేకులు పడ్డాయి. ప్రస్తుతం జంక్షన్ జామ్. కాలం కలిసి రాక కాలక్షేపం చేయాల్సిందేనా? ఎవరా మాజీ మంత్రి? రావెల కిశోర్ బాబు. 2014లో ప్రత్తిపాడు నుంచి ఎమ్మెల్యేగా గెలిచి.. ఆ వెంటనే మంత్రి అయిపోయారు. టీడీపీ అధికారంలో ఉండగానే.. అసంతృప్తి మూటగట్టుకోవడంతో మధ్యలోనే కేబినెట్ నుంచి ఉద్వాసన తప్పలేదు. తర్వాత టీడీపీకి గుడ్‌బై చెప్పి.. 2019 ఎన్నికలకు ముందు జనసేనలో చేరిపోయారు రావెల. గ్లాసు గుర్తుపై పోటీ చేసినా నెగ్గలేదు. ఆపై అక్కడా కుదురుగా ఉ ండలేదు. బీజేపీకి జైకొట్టి.. కాషాయ కండువాను మెడలో వేసుకున్నారు. ఈ మధ్య కాలంలో బీజేపీకి హ్యాండిచ్చారు. తిరిగి టీడీపీలోకి వెళ్తున్నట్టు సంకేతాలు ఇచ్చి.. చంద్రబాబుతో సన్నిహితంగా మెలిగి.. తెలుగు తమ్ముళ్లలో అనేక ప్రశ్నలకు కేంద్ర బిందువు అయ్యారు రావెల. మహానాడు సమయంలోనే రావెల కిశోర్‌బాబు టీడీపీలో చేరతారని ప్రచారం జరిగింది. ఏమైందో ఏమో.. ఆయన టీడీపీ కండువా కప్పుకోలేదు. జిల్లా రాజకీయాల్లోనూ యాక్టివ్‌గా లేరు. దీంతో మాజీ మంత్రి రాజకీయ భవిష్యత్ ఏంటనేది ప్రశ్నగా మారింది. రావెలను టీడీపీలోకి రాకుండా ప్రత్తిపాడులోని కొన్ని గ్రూపులు అడ్డుకున్నాయట. నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్తగా ఉన్న మాకినేని పెదరత్తయ్య సైతం కార్యకర్తల మనోభావాన్ని పార్టీ పెద్దలకు వివరించారట. గతంలో కిశోర్‌బాబు గ్రూపులు కట్టడం వల్లే ప్రత్తిపాడులో టీడీపీ ఇబ్బంది పడిందని.. ఇప్పుడు ఆయన మళ్లీ వస్తే అదే రిపీట్ అవుతుందని పెదరత్తయ్య చెప్పారట. దాంతో టీడీపీ హైకమాండ్ ఆలోచనలో పడినట్టు తెలుస్తోంది. టీడీపీలో చేరినా.. ఫలానా చోట టికెట్ కావాలని కండీషన్ పెట్టొద్దని రావెలకు సమాచారం వెళ్లిందట. ఆ కబురు రుచించక టీడీపీలో జాయినింగ్‌ను దాట వేశారని ప్రత్తిపాడులో ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే మూడు పార్టీలు మారిన రావెల.. టీడీపీలోకి వెళ్లినా టికెట్ గ్యారెంటీ లేకపోతే ఎలా అనే సంశయంలో పడ్డారట. అందుకే మౌనంగా ఉన్నారట. ప్రత్తిపాడు ఎమ్మెల్యే సుచరిత కుటుంబంలో ఒకరు బాపట్ల ఎంపీగా పోటీ చేస్తారని ప్రచారం జరుగుతోంది. ఆ విషయం తెలిసి రావెల తన ప్లాన్ మార్చుకున్నారని చెబుతున్నారు. ఎన్నికలకు దగ్గరకు వచ్చాక వ్యూహాలకు పదును పెట్టాలని చూస్తున్నారట. ప్రత్తిపాడులో రావెల రాజకీయ కథ ముగిసినట్టేనని స్థానికంగా మరో చర్చ నడుస్తోంది. జిల్లాలోని మరో నియోజకవర్గం నుంచి ఆయన అదృష్టం పరీక్షించుకునే అవకాశం ఉందని సమాచారం. అయితే ఆ నియోజకవర్గం ఏంటన్నది.. ఏ పార్టీలోకి వెళ్లి పోటీ చేస్తారన్నది బయట పెట్టడం లేదట. మొత్తంగా మెరుపు వేగంతో రాజకీయాల్లోకి వచ్చి.. అంతే వేగంతో పొలిటికల్ స్క్రీన్ పైనుంచి తెరమరుగయ్యారు. మరి.. కొత్త ఆలోచనలు మాజీ మంత్రికి వర్కవుట్ అవుతాయో లేదో చూడాలి.

## పాఠశాలల విలీనంపై తల్లిదండ్రుల ఆందోళన

మైలవరంమూడు నాలుగు ఐదు తరగతుల పాఠశాలలు విలీనంపై మైలవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వద్ద తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. నెలరోజులుగా వినతిపత్రాలు ఇస్తున్నా... స్పందించని అధికారులు.. పిల్లల క్లాసులు పోతున్నాయని తల్లిదండ్రుల ఆవేదన వ్యక్తం చేసారు. కనీసం తల్లిదండ్రులు వినతులను కూడా తీసుకోవడం లేదని అధికారుల తీరుపై మండిపడ్డారు. పొందుగల రోడ్డులో ఉన్న పాఠశాలలను మైలవరం బాలుర హైస్కూల్ కు మర్చడం వలన పిల్లలు దారితప్పి పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు చేయడం జరుగుతుందని తల్లిదండ్రులు వారి బాధలను మాజీ మంత్రి దేవినేని ఉమాకు తెలిపి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేసారు తల్లిదండ్రుల నిరసనకు అయన మద్దతు తెలిపారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి మరియు మండల విద్యాశాఖాధికారితో దేవినేని మాట్లాడారు. తల్లిదండ్రులు విజ్ఞప్తులను కలక్టర్ మరియు సంబంధిత అధికారులకు తెలిపి వెంటనే న్యాయం చేయాలని డిమాండ్ చేసారు. దేవినేని మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం అడ్డుపెట్టుకొని జగన్మోహన్ రెడ్డి ఏకపక్షంగా మూర్ఖంగా విద్యా వ్యవస్థను చంపేసే నిర్ణయాలు తీసుకుంటున్నారు. మూడు నాలుగు ఐదు తరగతుల ప్రాథమిక పాఠశాలల విలీనం హేతుబద్ధంగా లేదు. ప్రభుత్వ పాఠశాలల వ్యవస్థ నాశనమై ప్రైవేటు పాఠశాలలు పెరిగేందుకు జగన్ రెడ్డి చర్యలు దోహదపడతాయి.

## తొలిసారి ఎమ్మెల్యేలకు పరీక్షా కాలం

గుంటూరు, ఆగస్టు 1, వైసీపీలో తొలిసారి ఎన్నికైన ఎమ్మెల్యేలు దాదాపు 66 మంది ఉన్నారు. మొత్తం 175 నియోజకవర్గాలకు గాను కొత్త వారిని ఎంపిక చేయడంతో జగన్ గత ఎన్నికల్లో సక్సెస్ అయ్యారు. ఇప్పుడు తొలిసారి గెలిచిన ఎమ్మెల్యేల పనితీరుపై జగన్ దృష్టి పెట్టినట్లు తెలిసింది. వారి పనితీరు ఆధారంగానే వచ్చే ఎన్నికల్లో టిక్కెట్లు తిరిగి లభించే అవకాశముంది. కొందరు ఎమ్మెల్యేలపై వ్యతిరేకత ఉన్నట్లు తెలియడంతో వారికి ఫస్ట్ వార్నింగ్ ఇచ్చారని తెలిసింది. వారి పనితీరును మెరుగుపర్చుకోవాలని సూచించినట్లు సమాచారం. వారు మారకుంటే టిక్కట్లు దక్కడం కష్టమేనంటున్నారు. పనితీరును మార్చుకోవాలని జగన్ ఇప్పటికే కొందరికి సూచించినట్లు తెలుస్తోంది. ప్రధానంగా చిత్తూరు జిల్లాలో మూడు నియోజకవర్గాల్లో తొలి సారి గెలిచిన ఎమ్మెల్యేలపై అసంతృప్తి నెలకొంది. వీరికి ఇప్పటికే హెచ్చరికలు అధిష్టానం నుంచి అందాయి. నియోజకవర్గంలో అందుబాటులో లేకపోవడం, సొంత పార్టీ నేతల నుంచి వ్యతిరేకత మొదలు కావడంతో రానున్న కాలంలో పనితీరు మార్చుకోవాల్సిందిగా సూచనలు అందినట్లు చెబుతున్నారు. కొన్ని జిల్లాల్లో సామాజిక సమీకరణాలు, పార్టీలో అసంతృప్తుల నేపథ్యంలో దృష్ట్యా కొందరికి మరోసారి టిక్కెట్ దక్కే అవకాశం లేదని అంటున్నారు. ప్రకాశం జిల్లాలోని సంతనూతలపాడు, దర్శి, కనిగిరి, కర్నూలు జిల్లాలోని కోడుమూరు, నందికొట్కూరు, నెల్లూరు జిల్లాలోని గూడూరు, గుంటూరు జిల్లాలోని తాడికొండ, పొన్నూరు, తూర్పు గోదావరి జిల్లాలోని రంపచోడవరం, విశాఖ జిల్లాలోని పాడేరు, గాజువాక, విజయనగరం జిల్లాలోని ఎస్.కోట వంటి చోట్ల అభ్యర్థి మార్పు ఖాయమంటున్నారు. వీరంతా డేంజర్ జోన్ లో ఉ న్నట్లే. రానున్న కాలంలో వీరు పనితీరును మార్చుకుని, పార్టీలో ఉన్న అసంతృప్తులను తొలగించుకోకుంటే వచ్చే ఎన్నికల్లో వీరందరికీ టిక్కెట్లు దక్కడం కష్టమేనన్న టాక్ పార్టీ నుంచి విన్పిస్తుంది. గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమంలో వీరు ఆశించిన తీరులోనే పనిచేస్తున్నా ప్రజల నుంచి పెద్దగా వీరికి స్పందన రావడం లేదంటున్నారు. పలుమార్లు జరిపిన సర్వేల్లోనూ వీరే వెనకబడి ఉండటాన్ని జగన్ గమనించారట. వీరంతా తొలిసారి ఎమ్మెల్యే అయినా కార్యకర్తలతో కలివిడిగా పనిచేయకపోవడంతో అక్కడ పార్టీ పరిస్థితి దయనీయంగా మారిందన్న రిపోర్టులు వచ్చాయి. 2012 నుంచి ఆ నియోజకవర్గాల్లో ఉన్న క్యాడర్ దూరమయిపోతుందని జగన్ భావిస్తున్నారు. అందుకే నియోజకవర్గాల క్యాడర్ తో వచ్చే నెల 4 వతేదీ నుంచి జగన్ నేరుగా ఇంట్రాక్ట్ అవ్వాలని నిర్ణయించారని చెబుతున్నారు. మొత్తం మీద తొలిసారి ఎన్నికైన ఎమ్మెల్యేల్లో అధిక శాతం మందికి ఈసారి టిక్కెట్లు దక్కడం కష్టమేనన్నది వాస్తవమని పార్టీ సీనియర్ నేతలు సయితం అంగీకరిస్తున్నారు.

## పేద ప్రజలకు వైద్య సేవలు అందించాలి

కడప ప్రజా ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్.బి అంజాద్ బాషా అన్నారు. ఆదివారం స్థానిక శంకరాపురం లోని బ్లైండ్ స్కూల్ సమీపంలో మెహతాబ్ ఆస్పత్రి ప్రారంభోత్సవ కార్యక్రమం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్.బి అంజాద్ బాషా, నగర మేయర్ కే సురేష్ బాబు చేతుల మీదుగా జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో పేద ప్రజల కొరకు అనేక వైద్య ఆరోగ్య సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి అమలు చేస్తున్నారని వాటిని పేద ప్రజలు వినియోగించుకోవాలని అన్నారు. అలాగే వైద్యులు పేద ప్రజలకు వైద్య సేవలు అందించే స్వభావం కలిగి ఉండాలని వైద్య వృత్తి పూజింప తగ్గ వృత్తి అని అన్నారు. మెహతాబ్ ఆస్పత్రిని ఏర్పాటు చేసిన డాక్టర్ రాజా అహ్మద్ కు అభినందనలు తెలిపారు. నగర మేయర్ కె.సురేష్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కొరకు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని అందులో ముఖ్యంగా వైద్య ఆరోగ్య సేవలకు పెద్ద పీట వేయడం జరిగిందని ప్రజలు వైద్య సేవలు వినియోగించుకోవాలని అన్నారు. తొలుత రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్ బి అంజాద్ బాషా, నగర మేయర్ కే సురేష్ బాబు లు రిబ్బన్ కత్తిరించి ఆసుపత్రిని ప్రారంభించారు. అనంతరం ఆస్పత్రిలోని ఆర్థో, గైనిక్, న్యోరో వివిధ విభాగాలను పరిశీలించి డాక్టర్ రాజా అహ్మద్ తో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం లో వైసిపి నాయకులు అఫ్జల్ ఖాన్, డాక్టర్ వేంపల్లి భాష, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రములో రేషన్ వ్యవస్థ నిర్వీర్యం

తెలుగుదేశం పార్టీ నాయకులు

బద్వేలు తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబునాయుడుపిలుపు మేరకు బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ పార్టీ యువనేత రితేష్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో రేషన్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న రాష్ట్రప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ సోమవారం ఉదయం బద్వేలు పట్టణ తెదేపా అధ్యక్షుడు గుర్రంపాటి వెంగళరెడ్డి× ఆధ్వర్యంలో బద్వేలు మున్సిపాలిటీ కార్యాలయంలో కమిషనర్ కె వి కృష్ణారెడ్డి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెదేపా బద్వేలు బాధ్యులు డాక్టర్ ఓబులాపురం రాజశేఖర్, అట్లూరు మండల పార్టీ అధ్యక్షులు మల్లికార్జునరెడ్డి, బద్వేలు రూరల్ మండల పార్టీ అధ్యక్షులు బసిరెడ్డి రవికుమార్ రెడ్డి(టీవీఎస్ రవి), పట్టణ ప్రధాన కార్యదర్శి మిత్తికాయల రమణయాదవ్, సీనియర్ నాయకులు కొంకుల రాంబాబు, మున్సిపాలిటీ కౌన్సిలర్ షేక్ హాసన్, మాజీ కౌన్సిలర్ సమ్మెట అబ్రహాం, బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి కొలవలి వేణుగోపాల్, తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జహంగీర్, ఎస్సీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి వాత్తటి దానం, ఉప్పలపాటి వెంకటసుబ్బయ్య, మాచుపల్లి వెంకటకృష్ణారెడ్డి, మస్తాన్ బాబు, రంజిత్ కుమార్ మరియు తేదేపా నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## వివేకా హత్యకేసులో ప్రధాన నిందితుల బెయిల్ పిటిషన్ల తిరస్కరణ

అమరావతి : మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న వారిలో ముగ్గురికి ఏపీ హైకోర్టు బెయిల్ తిరస్కరించింది. ప్రధాన నిందితులు దేవిరెడ్డి శివశంకరరెడ్డి, గజ్జల ఉమా మహేశ్వరరెడ్డి, సునీల్ యాదవ్ ప్రస్తుతం జైలులో ఉన్నారు. అయితే తమకు బెయిల్ మంజూరు చేయాలని కడప కోర్టులో పిటిషన్‌ను వేయగా కోర్టు తిరస్కరించింది. దీంతో నిందితులు హైకోర్టును ఆశ్రయించారు. ఇవాళ పిటిషన్‌ను ఏపీ హైకోర్టు పరిశీలించింది. బెయిల్ ఇస్తే సాక్ష్యాలను తారుమారు చేస్తారని సీబీఐ తరుపున న్యాయవాది కోర్టుకు వివరించారు.

# 24 గంటల్లో మిస్టరీ హత్య కేసు చేదింపు



బద్వేలు ప్రకాశం జిల్లా కొమరోలు మండలం గోపాలునిపల్లే గ్రామానికి చెందిన దేవభూషణం సునీత భార్యాభర్తలు. వీరికి 8 సంవత్సరాల వయసు ఉన్న కుమారుడు ఉన్నాడు. ఉపాధి నిమిత్తం గత కొంత కాలంగా కడపలో వీరి కుటుంబం నివాసం ఉంటుంది. బద్వేలు మండలం కొత్తచెరువు గ్రామానికి చెందిన గొడుగునూరు నారాయణతో ఈ కుటుంబానికి పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్త దేవభూషణం భార్య సునీతతో నారాయణకు అక్రమ సంబంధం ఏర్పడింది. వీరి అక్రమ సంబంధం చాలాకాలం నడిచింది. కొంతకాలానికి ఈ విషయం దేవా భూషణానికి తెలియడంతో భార్యాభర్తల మధ్య గొడవలు ఏర్పడ్డాయి. తరచూ గొడవలు జరుగుతుండడంతో ఈ విషయాన్ని సునీత నారాయణకు చెప్పడం జరిగింది. ఈ నేపథ్యంలో దేవ భూషణంను హతమార్చేందుకు ఇద్దరు ఒక పన్నాగం పన్నారు. ఇందుకు

**మద్యం సీసా పై ఉన్న స్టిక్కర్ తో హత్యను చేదించిన బద్వేలు రూరల్ పోలీసులు**

**ఇద్దరు హంతకుల అరెస్టు**

**మైదుకూరు డిఎస్పి వంశీధర్ గౌడ్**

**బద్వేలు రూరల్ సి ఐ హనుమంతు నాయక్**

సంబంధించిన వివరాలు మైదుకూరు డిఎస్పి వంశీధర్ గౌడ్ బద్వేలు రూరల్ సీఐ హనుమంతు నాయక్ సోమవారం మధ్యాహ్నం రూరల్ సర్కిల్ పోలీస్ కార్యాలయంలో విలేఖర్లకు వివరించారు గత నెల 27వ తేదీ బద్వేల్ మండలం తిప్పనపల్లె బీడు భూముల్లో దేవభూషణం (46) శవంగా మారి కనిపించాడు. మృతదేహం ఎవరిదో తెలియక పోవడంతో విఆర్ఓ విజయ్ కుమార్ ఫిర్యాదు మేరకు బద్వేలు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు పోలీసులకు సవాలుగా మారింది. జిల్లా ఎస్పి ఆదేశాల మేరకు మైదుకూరు డిఎస్పి వంశీధర్ గౌడ్ ఆధ్వర్యంలో బద్వేలు రూరల్ సీఐ హనుమంతు నాయక్ రూరల్ ఎస్సై చంద్రశేఖర్ వారి సిబ్బంది విచారణ చేపట్టారు. దేవ్ భూషణం మృతదేహం పక్కన మద్యం సీసా ఉండడం దాని పై ఉన్న స్టిక్కర్ ఆధారంగా మద్యం ఎక్కడ కొనుగోలు చేసింది విచారించారు. మద్యం సిద్ధవటం లోని ఒక షాపులో కొనుగోలు చేసినట్లు గుర్తించారు. ముందుగా వేసుకున్న పథకం ప్రకారం తన మరదలు సౌదీ కి వెళుతుందని ఈ సందర్భంగా పార్టీ ఇస్తున్నట్లు చెప్పి నారాయణ దేవభుషణాన్ని తన ద్విచక్ర వాహనం మీద ఎక్కించుకొని తీసుకు వచ్చాడు. సిద్ధవటములో మూడు మద్యం బాటిళ్లు కొనుగోలు చేసి అవి తీసుకొని తిప్పనపల్లికి రావడం జరిగింది. అక్కడ దేవభుషణానికి పూర్తిగా మద్యం తాగించాడు. ఇదంతా గత నెల 26వ తేదీ జరిగింది. తర్వాత మిగిలిన మద్యాన్ని అదే రోజు రాత్రి ఎర్ర వంక పక్కన కూర్చొని సాధించాడు. దీంతో పూర్తి మద్యం మత్తులో ఉన్న దేవ భుషణాన్ని ముందుగా వేసుకున్న పథకం ప్రకారం అతని తలపై బండరాయివేసి హతమార్చాడు. అక్కడి నుంచి నారాయణ వెళ్ళిపోయాడు. ఆ మరుసటి రోజు దేవ భూషణం హత్య విషయం వెలుగు చూసింది. పోలీసులు అట్లూరు ం సిద్ధవటం మధ్య ఉన్న సీసీ కెమెరాల ఆధారంగా హత్య చేసిన నారాయణను కేవలం 24 గంటల్లో పట్టుకున్నారు. సోమవారం ఉదయం వెంకట శెట్టి పల్లె తిప్పన పల్లె మార్గమధ్యంలో పట్టుకున్నట్లు డి.ఎస్.పి వంశీధర్ గౌడ్ తెలిపారు. రెండు రోజులు ముందే దేవా భూషణం భార్య సునీతను అరెస్ట్ చేసి రిమాండ్కు పంపినట్లు వారు తెలిపారు. హత్య కేసును కేవలం 24 గంటల వ్యవధిలో చేదించిన బద్వేల్ సిఐ హనుమంతు నాయక్ రూరల్ ఎస్సై చంద్రశేఖర్ వారు సిబ్బందిని జిల్లా ఎస్పీ మైదుకూర్ డిఎస్పిలు ప్రత్యేకంగా అభినందించారు

## కాఫర్ డ్యామ్ ను పరిశీలించిన అధికార బృందం

ఏలూరుఆంధ్రప్రదేశ్‌లో నిర్మాణంలో ఉన్న పోలవరం ప్రాజెక్టును కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) బృందం సందర్శించింది.పోలవరం ప్రాజెక్టు ప్రాంతానికి చేరుకున్న ముగ్గురు సభ్యుల బృందం.. అక్కడి అప్పర్ కాఫర్‌డ్యామ్‌ను పరిశీలించింది. గోదావరి నదికి వరదలు వచ్చిన తర్వాత తొలిసారిగా ఈ బృందం ఏపీలోని పోలవరం ప్రాజెక్టుకు వచ్చింది. కాగా, పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌ను అరికట్టి నష్టాలను తగ్గించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలవరం ప్రాజెక్టు అథారిటీకి తెలంగాణ ఈఎన్సీ లేఖ రాశారు.పోలవరం ప్రాజెక్టును ఖయ్యూమ్ మహ్మద్ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల బృందం పోలవరం ప్రాజెక్టును సందర్శించింది. ఎగువ కాఫర్ డ్యామ్ స్పిల్ వే దిగువ ప్రాంతాలను పరిశీలించింది. కాఫర్ డ్యాం ఎత్తు పనులను మ్యాప్‌ల ద్వారా పరిశీలించిన బృందం సభ్యులు.. ప్రాజెక్టు పరిస్థితి, జరుగుతున్న పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. జాతీయ ప్రాజెక్టుగా గుర్తింపు ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాగస్వామ్యంతో ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి భూములు కోల్పోయిన వారికి నష్టపరిహారం అందజేసి మౌలిక వసతులు కల్పిస్తున్నది.ఇటీవల గోదావరికి భారీగా వరద పోటెత్తడంతో ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరింది. దాంతో గ్రామాలు ముంపునకు గురై పంటలు, ఆస్తినష్టం వాటిల్లింది. మరోవైపు బ్యాక్ వాటర్‌పై అధ్యయనం చేయాలని కోరుతూ తెలంగాణ ఈఎన్సీ శనివారం పోలవరం ప్రాజెక్టు అథారిటీకి లేఖ రాశారు. బ్యాక్ వాటర్ ప్రభావంపై స్వతంత్ర సంస్థ ద్వారా అధ్యయనం చేయాలని కోరారు. ప్రాజెక్టు పూర్తయితే భద్రాచలానికి బ్యాక్ వాటర్ ముప్పు తప్పదని తమ లేఖలో తెలంగాణ ఈఎన్సీ స్పష్టం చేశారు.

## అర్జీదారుల సమస్యలను వేగవంతంగా పరిష్కరించండి

కడప ప్రజా సమస్యల పరిష్కారార్థం ఏర్పాటు చేసిన "స్పందన" కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీదారుల సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్లోని స్పందన హాల్లో.. ప్రజా ఫిర్యాదుల స్వీకరణ "స్పందన" కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు తో పాటు జాయింట్ కలెక్టర్ సాయికాంత్ వర్మ , ఇంఛార్జి డిఆర్వో, స్పెషల్ కలెక్టర్ రామమోహన్, డ్వామ, డిఆర్డీఏ పీడిలు యదుభూషన్ రెడ్డి, పెద్దిరాజు, అనుడ విసి శ్రీలక్ష్మి ,..లు హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు మాట్లాడారు ప్రజలు జిల్లా స్పందనలో అర్జీ ద్వారా కలెక్టర్ కు విన్నవించారు.ఈ కార్యక్రమంలో సిపివో వెంకట రావు, సమగ్ర శిక్ష పీడి ప్రభాకర రెడ్డి, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా.నాగరాజు, మెప్మా పీడి రామమోహన్ రెడ్డి, రిమ్స్ సూపర్ ఇన్ టెండెంట్ డా.వెంకటేశ్వర రావు, ఎల్డిఎం దుర్గా ప్రసాద్, పంచాయతీ రాజ్ ఎస్ ఈ శ్రీనివాస రెడ్డి, ఆర్ డ బి ఎస్ ఈ మహేశ్వర రెడ్డి, గృహనిర్మాణ శాఖ పీడి కృష్ణయ్య, ఎస్ సి కార్పొరేషన్ ఈడి వెంకట సుబ్బయ్య, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖాధికారి బ్రహ్మయ్య, జిల్లా వ్యవసాయ శాఖాధికారి నాగేశ్వరరావు, అన్ని శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు ఆహార భద్రత అనేది రాజ్యాంగం కల్పించిన హక్కు



**టిడిపి మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి వెల్లడి**

అల్లూరి ప్రజలకు ఆహార భద్రత అనేది రాజ్యాంగ బద్దంగా సిద్ధించిన హక్కు. దశాబ్దాలుగా అమలవుతున్న ఆహార భద్రత కార్యక్రమాలకు గత కొద్ది రోజులుగా రాష్ట్రంలో తిలోదకాలివ్వడం బాధాకరమని పాడేరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు పాడేరు తాసిల్దార్ వారికి ఆహార భద్రత సక్రమంగా అమలు చేయాలని వినతి పత్రం సమర్పించడం జరిగింది. అనంతరం ఆమె మాట్లాడుతూనిత్యావసర వస్తువల ధరలపై నియంత్రణ కొరవడిందని,రేషన్ షాపుల్లో ఇచ్చే సరుకుల్లో నాణ్యతా అంతంత మాత్రంగానే ఉంటోందన్నారు. కందిపప్పు, పంచధార ధరల్ని అమాంతం పెంచేయడంతో కార్డు దారులకు అధనపుభారం మోపారన్నారు. మండల వ్యాప్తంగా వందలాది రేషన్ కార్డులు రద్దయ్యాయని, కరోనా సమయంలో ప్రకటించిన పి ఎం జి కె ఏ వై పథకం కింద అందించాల్సిన ఉచిత బియ్యం పథకాన్ని గత నాలుగు నెలలుగా నిలిపివేశారన్నారు. ఇప్పుడు అమలు చేస్తున్నప్పటికీ కొందరికి మాత్రమే ఇస్తున్నారని,ఈ నిర్ణయం ఆహార భద్రత చట్టాన్ని ఉల్లంఘించడమే అవుతుందన్నారు.2019కి ముందు తెలుగుదేశం ప్రభుత్వ హయంలో రేషన్ షాపుల్లో రూ.1కి – కిలో బియ్యం, రూ.40కి కిలో చొప్పున – రెండు కిలోల కందిపప్పు, రూ.10కి – అరకిలో పంచదార, రు.16.50కి– కిలో గోధుమపిండి, రూ.12 కి – అయోడైజ్డ్ సాల్ట్ సహా కిలో రూ.1 చొప్పున జొన్నలు, రాగులు వంటి చిరుధాన్యాలు, మహిళలకు సబ్సిడీతో శానిటరీ పాడ్స్ వంటి సుమారు 8 రకాల వస్తువులు అందించడమైందన్నారు. ఇదే సమయంలో సంక్రాంతి, క్రిస్మస్, రంజాన్ పండుగలకు రూ.500 కోట్ల వ్యయంతో పండుగ కానుకలను రాష్ట్రంలోని 1.47 కోట్ల రేషన్ కార్డుదారులకు ఉచితంగా అందించడం జరిగిందన్నారు. జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక రేషన్ వ్యవస్థ మొత్తాన్ని నాశనం చేశారన్నారు. కార్డు దారులకు బియ్యం, పంచదార, కందిపప్పు మాత్రమే అందిస్తున్నారని,అన్ని సంక్షేమ పథకాలకు రేషన్ కార్డులే ప్రామాణికంగా చేసిన జగన్ ప్రభుత్వం రకరకాల కారణాలు చూపించి రాష్ట్రంలో సుమారు 18.72 లక్షల రేషన్ కార్డులని తొలగించారన్నారు.కరోనాతో ఎదురైన ఇబ్బందులు నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డుదారులకుపి ఎం జె కె వై పథకం కింద రేషన్ ఉచితంగా అందించడం జరిగిందన్నారు. ఆ పథకాన్ని ఏప్రిల్ నుండి సెప్టెంబర్ వరకు పొడిగించడం జరిగిందని, దేశంలోని అన్ని రాష్ట్రాలు ఉచిత బియ్యం పథకాన్ని ఆయా రాష్ట్రాల్లో అమలు చేస్తూ ఆహార పద్ధతులకు పెద్దపీట వేశారన్నారు. కానీ ఆంధ్రప్రదేశ్ లో మాత్రం 4 నెలలుగా ఈ పథకాన్ని నిలిపివేశారన్నారు. తెల్ల రేషన్ కార్డుదారులకు బియ్యం ఇవ్వకుండా ఆహార భద్రత చట్టాన్ని ఉల్లఘిస్తున్నారన్నారు.ఇది చట్టరీత్యా నేరం. తెల్ల రేషన్ కార్డులోని సభ్యులకు ఒక్కొక్కరికి నెలకు 5 కిలోల చొప్పున 4 నెలలకు 20 కిలోల బియ్యం అలాగే ఆగస్టు 5 కిలోల బియ్యం మొత్తం 25 కిలోల బియ్యం పంపిణీ చేయాల్సి ఉన్నా, ప్రభుత్వం పట్టించుకోవడం చాలా విడ్డూరంగా ఉందని ఆమె ఎదవ చేశారు. ఫలితంగా గత 4 నెలల్లో ఒక్కో సభ్యుడు 700 రూపాయులు (20 కిలోలు లీ రూ.35) నష్టపోయారని,రాష్ట్రంలో 1.47 కోట్లు కార్డులోని 4.20 కోట్ల మంది సభ్యులు 4 నెలల కాలానికి 2,940 కోట్లు విలువగల ఉచిత బియ్యాన్ని రాష్ట్ర ప్రభుత్వ ఉదాసీనత కారణంగా నష్టపోయారన్నారు. రాష్ట్రంలోని మొత్తం 1.47 కోట్ల తెల్ల రేషన్ కార్డుదారులు అందరికీ అసమానతలు లేకుండా ఏప్రిల్, మే, జూన్, జూలై నెల రేషన్ 20 కేజీలు + 5 కేజీలు ఆగస్టులో మొత్తం 25 కేజీలు రేషన్ వెంటనే 1.47 కోట్ల తెల్ల రేషన్ కార్డుదారులు అందరికీ అందించాలన్నారు.తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ సాధారణంగా ఇచ్చే బియ్యంతో పాటు, ఉచిత బియ్యాన్ని కూడా అందించాలని,ఇంటి ముందుకే రేషన్ బియ్యం పేరుతో ప్రారంభించిన ఎం డి యు వాహనాల ఆపరేటర్లు, వీధి చివర్లో/ఏదైనా సెంటర్లో వాహనం ఆపి బియ్యం పంపిణీ చేస్తున్నారన్నారు. ఈ పద్ధతిని సమీక్షించి ఇళ్ల వద్దకు తెచ్చి ప్రభుత్వ ఉద్దేశ్యాన్ని అమలు చేయాలని, రేషన్ వ్యవస్థ ద్వారా ఇవ్వాల్సిన సరుకుల సంఖ్యను కూడా కుదించి బియ్యానికి మాత్రమే పరితం చేశారన్నారు. ఇది ఆహార భద్రత చట్టాన్ని తుంగలో తొక్కడమే అవుతుందన్నారు. బియ్యంతో పాటు కందిపప్పు, పంచధార సహా చిరుధాన్యాలు, గోధుమ పిండి వంటి గతంలో అమలైన అన్ని రకాల సరుకుల్ని కూడా రేషన్ వ్యవస్థలో కొనసాగించాలన్నారు.

## 8న వైవీయూలో అధ్యాపకుల నియామకానికి వాకిన్ ఇంటర్వ్యూలు

కడప యోగి వేమన విశ్వవిద్యాలయం పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ (పి.ఎస్.అండ్ పి.ఎ) విభాగంలో అకడమిక్ కన్సల్టెంట్స్ (అధ్యాపకుల) నియామకానికి ఆగస్టు 8వ తేదిన నేరుగా ముఖాముఖి (ఇంటర్వ్యూలు) నిర్వహించనున్నట్లు పీజీ కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య కె.కృష్ణారెడ్డి తెలిపారు. అకడమిక్ కన్సల్టెంట్స్ ఒక పోస్టునకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నిబంధనల మేరకు ఎంఏ పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులన్నారు. ఓసీ, ఓబీసీ అభ్యర్థులకు పీజీలో 55 శాతం మార్కులు ఉండాలని, ఎస్సీ ఎస్టీ వర్గాలకు 50 శాతం ఉన్నకూడా అర్హులన్నారు. పి హెచ్ డి, నెట్, సెట్ ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. అభ్యర్థులు బయోడేటా ఒరిజినల్ సర్టిఫికెట్ లతో యోగి వేమన విశ్వవిద్యాల యంలోని ప్రధానాచా ర్యులు కార్యాలయంలో 8వ తేదీ ఉదయం10 గంటలకంతా హాజరు కావాలన్నారు

## ఐదేళ్లలో 18 వేల కోట్లకు పెరిగిన బకాయిలు

హైదరాబాద్, ఆగస్టు1 ) రాష్ట్ర విద్యుత్ డిస్కంల భారం ఏటేటా పెరుగుతూ ఉన్నది. ఐదేళ్ళ క్రితం కేవలం రూ. 2,844 కోట్ల మేర జెన్‌కో సంస్థలకు, విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు ఉన్న బకాయిలు జూలై 2022 చివరి నాటికి రూ.19,745 కోట్లకు చేరాయి. గతేడాది ఇదే జూలై నెలతో పోలిస్తే రూ. 5,944 కోట్లు పెరిగింది. గరిష్టంగా సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌కు రూ. 9,954 కోట్లు, 'సెంబ్ కార్ప్ ఎనర్జీ' అనే సంస్థకు రూ. 2,735 కోట్ల చొప్పున బాకీ ఉన్నాయి. విద్యుత్ ఛార్జీలను పెంచుకున్నా.. నష్టాలు కొనసాగుతూనే ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత వ్యవసాయ విద్యుత్‌కు రూ.6,850 కోట్లు, వివిధ సెక్షన్ల ప్రజలకు సబ్సిడీ పేరుతో రూ. 1,466 కోట్ల చొప్పున ఖర్చు చేస్తూ ఉన్నది. ఇటీవల డిస్కంలకు రాష్ట్ర ప్రభుత్వం రీఇంబర్స్ చేసినా.. నష్టాల్లో మాత్రం పెద్దగా తేడా కనిపించలేదు.డిస్కంల బకాయిలను వెంటనే చెల్లించేలా రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలని స్వయంగా ప్రధానమంత్రి మోడీ రెండు రోజుల క్రితం వ్యాఖ్యానించడం గమనార్హం. ఆర్టీసీ తరహాలోనే డిస్కంలకు కూడా ప్రతీ ఏటా నష్టాలు వస్తూనే ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో డిస్కంలకు సుమారు రూ. 6,831 కోట్ల మేర నష్టాలు రావచ్చని.. ఉత్తర, దక్షిణ డిస్కంలు రాష్ట్ర విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్‌కు నివేదిక సమర్పించి చార్జీలను పెంచుకోవడం ద్వారా భర్తీ చేసుకుంటామని, ఇందుకు అనుమతి ఇవ్వాలని కోరాయి. కానీ కమిషన్ మాత్రం డిస్కంలు ప్రతిపాదించిన 18%కి బదులుగా కేవలం 14% వరకే అనుమతి ఇవ్వడంతో రూ. 5,596 కోట్ల మేర మాత్రమే సర్దుబాటయ్యే అవకాశం ఉన్నది. 'ఉదయ్' పథకం ద్వారా రాష్ట్రానికి రూ. 10,200 కోట్లు ఇటీవల మంజూరయ్యాయి. వీటిని తీసుకున్నా కూడా డిస్కంలకు ఏర్పడిన



నష్టాన్ని పూర్తిగా సర్దుబాటు చేసుకునే వీలు లేకుండా పోయింది.గతంలో 24 గంటల ఉచిత వ్యవసాయ విద్యుత్ స్కీమ్, దారిద్ర్య రేఖకు దిగువన (బీపీఎల్) ఉన్న వివిధ సెక్షన్ల ప్రజలకు సబ్సిడీ పేరుతో సరఫరా చేసే కరెంటు ఛార్జీల భారాన్ని రాష్ట్ర ప్రభుత్వంమే మోస్తున్నది. ఈ రెండూ కేటగిరీలు కలిపి ప్రభుత్వానికి రూ. 5,940 కోట్ల భారం మాత్రమే ఉండేది. ఇప్పుడు సెలూన్లు, లాండ్రీలు కూడా ఆ జాబితాలోకి చేరాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ సబ్సిడీ భారం రూ. 8,221 కోట్లకు చేరింది. ఇటీవల కాలంలో వివిధ ఉత్పత్తి సంస్థల నుంచి కొంటున్న విద్యుత్ ధరలు పెరగడంతో గతంలో రూ. 6.04కు ఒక యూనిట్ లభించే కరెంటు ఇప్పుడు రూ. 7.03కు పెరిగింది. దీంతో రాష్ట్ర ఖజానా మీద కూడా భారం ఎక్కువైంది. సకాలంలో రీఇంబర్స్ కాకపోవడంతో డిస్కలంపై భారం పెరిగి నష్టాలు కూడా ఆ మేరకు పేరుకుపోవడానికి దారితీస్తున్నది.ఎన్ని ఇబ్బందులున్నా కరెంటును మాత్రం వ్యవసాయ రంగానికి ఉచితంగానే ఇస్తామని, స్కీమ్ నుంచి వెనక్కి వెళ్ళే ప్రసక్తే లేదని స్వయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ పలు సందర్భాల్లో నొక్కి చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి తీసకొచ్చినా విద్యుత్ సంస్కరణలను అమలుచేయబోమని కూడా ఖరాకండిగా తేల్చి చెప్పారు. ఐదేండ్ల కాలానికి రూ. 25 వేల కోట్ల నష్టం వచ్చినా వ్యవసాయ రంగానికి విద్యుత్‌ను ఫ్రీగానే ఇస్తామని, మోటార్లకు మీటర్లు పెట్టేదే లేదని కేంద్రానికి స్పష్టం చేశారు. ఐదేండ్లుగా రెండు డిస్కంల బకాయిలు, నష్టాలు పెరుగుతూనే ఉన్నాయి. ఈ ఏడాది జూలై చివరి నాటికి దేశవ్యాప్తంగా 'ఓవర్ డ్యూ' (దీర్ఘకాలంగా పేరుకుపోయినది), కరెంట్ డ్యూ (ప్రస్తుత నెలకు సంబంధించినది) మొత్తం 1.30 లక్షల కోట్ల బకాయిలు ఉన్నట్లు తేలింది. అత్యధికంగా తమిళనాడు బకాయిలు రూ. 24,544 కోట్లు ఉంటే ఆ తర్వాతి స్థానం రూ. 19,745 కోట్లతో తెలంగాణదే. రాష్ట్రం చెల్లించాల్సిన మొత్తం బకాయిల్లో రూ. 17,284 కోట్లు పాత బకాయిలుకాగా, రూ. 2,415 కోట్లు తాజా బిల్లుకు చెందిన బకాయిలు. విద్యుత్ ఉత్పత్తి, సరఫరా సంస్థలకు తెలంగాణ పడిన బకాయిల్లో ఎక్కువగా ఇండిపెండెంట్ పవర్ ప్లాంట్లకు చెందినవే. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలైన ఎన్టీపీసీ, తమిళనాడుకు చెందిన నైవేలీ లిగ్నయిట్ కార్పొరేషన్, న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ తదితర సంస్థలకు చెల్లించాల్సింది రూ. 1,140 కోట్లు. కానీ ఇండిపెండెంట్ సంస్థకు చెల్లించాల్సింది రూ. 12,447 కోట్లు. సంప్రదాయేతర ఇంధన వనరుల సంస్థలకు చెల్లించాల్సింది రూ. 3,578 కోట్లు.తెలంగాణ డిస్కంల ఐదేళ్ళ బకాయిలను పరిశీలిస్తే ఏటేటా గణనీయంగా పెరుగుతూ ఉన్నాయి. రాష్ట్రంలో 24 గంటల వ్యవసాయ విద్యుత్ పూర్తిస్థాయిలో అమలయ్యే సమయానికి డిస్కంల మొత్తం భారం మూడు వేల కోట్ల రూపాయల లోపే ఉంటే ఇప్పుడు అది ఆరు రెట్లు దాటింది.

## తులసీ రెడ్డి రాజకీయాల్లో ఉన్నత పదవులు పొందాలి

కడప తమ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ నర్రెడ్డి తులసీ రెడ్డి పార్టీ లో మరింత ఉన్నత స్థాయికి ఎదుగాలని ఆపార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చీకటి చార్లెస్ ఆశాభావం వ్యక్తంచేశారు సోమవారం తులసీ రెడ్డి జన్మదిన వేడుకలు వేంపల్లి లో ని ఆయన స్వగృహంలో ఘనంగా జరిగాయి ఈ సందర్భంగా చార్లెస్ తులసీ రెడ్డి కి పూల మాల వేసి పండ్లు,బుకే అందించి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు అనంతరం చీకటి చార్లెస్ మాట్లాడుతూ ఇలాంటి పుట్టినరోజు పండుగలు మరెన్నో జరుపుకోవాలని కోరుకుంటున్నానని చెప్పారు రాజకీయాల్లో బాగా రాణించాలని కోరారు, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు భవిష్యత్తులో మరిన్ని పదవులు పొంది ప్రజా సేవకు అంకితం కావాలని కోరారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కర్నాటి చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా మహిళా నాయకురాలు షేక్ గౌషియా, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కె లక్ష్మయ్య, ఎన్ ఎస్ యుఐ జిల్లా అధ్యక్షుడు యం బాబు, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు పెనుబాల ఓబులేసు, గంగాధర్,హజరతయ్య, మైనారిటీ నాయకులు మహబూబ్ పీరా పాల్గొన్నారు

## కేంద్రం మెడలు వంచుతామన్నారు

విజయవాడ,ఆగస్టు 1, కేంద్రం మెడలు వంచుతానని చెప్పి.. ఆయనే ఢిల్లీలో మెడ వంచుతున్నారు.. సీఎం జగన్ పై చంద్రబాబు ఫైర్ ఫ్యాన్ స్విచ్చాఫ్ చేసి సైకిల్ జోరు పెరిగితే బాధితులకు న్యాయం జరుగుతుందని టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. అల్లూరి జిల్లాలోని విలీన మండలాల్లో పర్యటించిన ఆయన వైసీపీ ప్రభుత్వం,..ఫ్యాన్ స్విచ్చాఫ్ చేసి సైకిల్ జోరు పెరిగితే బాధితులకు న్యాయం జరుగుతుందని టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. అల్లూరి జిల్లాలోని విలీన మండలాల్లో పర్యటించిన ఆయన వైసీపీ ప్రభుత్వం, సీఎం జగన్ పై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. వీఆర్ పురంలో వరద బాధితులను పరామర్శించారు. పోలవరం కట్టలేనని, ఆర్ అండ్ ఆర్ ఇవ్వలేనని సీఎం అంటున్నారని.. కేంద్రాన్ని అడుగుతూనే ఉంటానని ఇలా మాటలు మాత్రమే చెప్తాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు 25 ఎంపీలు గెలిస్తే కేంద్రం మెడలు వంచుతానని చెప్పిన జగన్.. ఆయనే ఢిల్లీకి వెళ్లి మెడ దించాడని ఎద్దేవా చేశారు. కేసుల కోసం రాష్ట్రాన్ని తాకట్టు పెడతున్నారని మండిపడ్డారు. పోలవరం ఆలస్యం కావడానికి ఏపీ ప్రభుత్వం కారణమని కేంద్రం చెప్పినప్పటికీ సీఎం జగన్ కు సరైన విజన్ లేదని విమర్శించారు. పోలవరం ఎప్పుడు పూర్తవుతుందో చెప్పలేనన్న ముఖ్యమంత్రి ఆర్‌అండ్‌ఆర్ పై చేతులెత్తేశారని తీవ్ర విమర్శ చేశారు. అదే టీడీపీ హయాంలో 72 శాతం పనులు పూర్తి చేసి, నిర్వాసితులకు ఇళ్లు కట్టించిన విషయాన్ని గుర్తు చేశారు.మళ్ళీ ముఖ్యమంత్రి అయితే పోలవరం పూర్తి చేసి, ఆర్ అండ్ ఆర్ పూర్తి చేసి శాశ్వత పరిష్కారం చూపిస్తా. ముంపు గ్రామాలను పాడేరు జిల్లాగా మార్చారు. ఇది కరెక్ట్ కాదు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వస్తే ముంపు ప్రాంతాలను పోలవరం ప్రత్యేక జిల్లా చేస్తా. మీ కష్టాలు చూస్తే గుండె తరుక్కుపోతోంది. హుదూద్ తుపాను వచ్చినప్పుడు కొత్త జీవో ఇచ్చి, అన్ని వసతులు కల్పించాం. విశాఖపట్నం వెళ్లి బస్సులోనే ఉన్నాను. కానీ గోదావరికి వరదలు వచ్చి అందరూ కష్టాలు పడుతుంటే ముఖ్యమంత్రి జగన్ తాడేపల్లి ప్యాలెస్ కే పరిమితమయ్యారు.

## నాగులచవితి

శ్రీశైలంనాగులచవితిని కొన్ని ప్రాంతాలలో శ్రావణమాసంలో ఆచరిస్తుండగా, మరికొన్ని చోట్ల కార్తీకమాసంలో ఆచరిస్తున్నారు. ఈ కారణంగా శ్రావణ శుద్ధ చవితి అయిన సోమవారం రోజున పలువురు భక్తులు ఆలయ ప్రాంగణంలోని నాగులకట్ట వద్ద నాగదేవతలను పూజించారు. సోమవారం రోజు వేకువజాము నుండి భక్తులు నాగులకట్ట వద్దకు చేరుకొని పత్తితో చేసిన వస్త్రం, యజ్ఞోపవీతం, పలురకాల పుష్పాలు మొదలైన వాటితో నాగమూర్తులను అలంకరించి పాలతో అభిషేకించారు. తరువాత నువ్వులపిండి, చలిమిడి, వడపప్పులను నివేదించారు. కాగా మన సంస్కృతిలో నాగసంప్రదాయానికి ఎంతో ప్రాముఖ్యం వుంది. అదేవిధంగా శ్రీశైలంలో కూడా పలుచోట్ల నాగవిగ్రహాలు కనిపిస్తాయి. ముఖ్యంగా ఆలయ ప్రాకారకుడ్యంపై పలుచోట్ల నాగశిల్పాలను దర్శించవచ్చు. ఈ నాగశిల్పాలలో తూర్పు ప్రాకారంపై గల ఆదిశేషుడు, దక్షిణవైపున గల నాగబంద శిల్పం ముఖ్యమైనవి.కాగా భక్తుల సౌకర్యార్థం దేవస్థానం ఇటీవల సర్పదోష నివారణ పూజలు నిత్య ఆర్జితసేవగా ప్రతీరోజు మూడు విడతలుగా ఉదయం గం 8.30లకు, ఆ తర్వాత గం. 11.30లకు తిరిగి సాయంకాలం గం. 5.30 లకు ఈ సర్పదోష నివారణ పూజలు జరిపించబడుతాయి.

## అఖండ నామ సంకీర్తన ప్రారంభం

తిరుమల తిరుమలలో అఖండ నామ సంకీర్తన 2007 సంవత్సరాంలో ప్రారంభించడం జరిగింది. అఖండ నామ సంకీర్తన మొదట పల్లేటుర్లలో ఉన్న జనపద కళాకారులతో ప్రారంభించామని టిటిడి ఇఓ ధర్మా రెడ్డి అన్నారు. కరోనా సమయంలో ఈ అఖండ నామ సంకీర్తన రద్దు చేశాం. దానిని తిరిగి ఇవాళ్టి నుండి పునఃప్రారంభించాం. రెండు తెలుగు రాష్ట్రాల నుండి దాదాపు 7 వేల 500 మంది కళాకారులు, గ్రూపులుగా సంవత్సరం పోడవునా ప్రతి రోజు పాల్గొంటారు. గ్రూప్ కి 15 మంది చొప్పున మొత్తం 1 లక్షా 13 వేల మంది జానపద కళాకారులు రిజిస్టర్ అయి ఉన్నారు. ప్రతి రోజు కూడా 12 గ్రూప్ల వారు ఈ అఖండ నామ సంకీర్తన భజన కార్యక్రమంలో పాల్గొంటారు. ఒక్కోక్క గ్రూప్ 1గంట సేపు పాల్గొంటారు,అలా 24 గంటల సేపు 24 గ్రూప్ల నిరంతరం ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ గ్రూప్ జానపద కళాకారులందిరికి కూడా రవాణా చార్జీలు తోపాటు తిరుమల బస చేసేందుకు గదులు కేటాయిస్తామని అన్నారు.

# ఉద్యమస్ఫూర్తితో కార్మికుల సమస్యలపై పోరాటం

## సీఐటీయు నాయకుడు పి.బాలాదేవ్



అల్లూరి జిల్లా/ పాడేరు ( విభారె) కార్మిక హక్కులు చట్టాలు పరిరక్షణకై స్వాతంత్ర ఉద్యమ స్ఫూర్తితో కార్మిక పోరాటాలు కొనసాగిస్తామని భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశంలో సిఐటియు పిలుపునిచ్చారు సిఐటియు కార్యదర్శి పి బాలాదేవ్ మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులు,చట్టాలు కాలరాస్తున్నాయని స్వాతంత్ర్య స్ఫూర్తికి విరుద్ధంగా కార్మిక చట్టాల సవరణలు చేస్తున్నారని, కనీస వేతన చట్టాన్ని సవరణ చేసి కార్మికులకు తీరని అన్యాయం చేస్తున్నారని, కార్మిక చట్టాలను నాలుగు కోడ్లు గా మార్చి సంఘం పెట్టుకునే హక్కు నిరసన తెలిపే హక్కు లేకుండా చేస్తున్నారని కార్మిక హక్కులు,చట్టాలు అమలు పని భద్రత కోసం ఈ నెల 1 తేదీ నుంచి 14వ తేదీ వరకు ప్రచార కార్యక్రమాన్ని సిఐటియు నిర్వహిస్తుందని కార్మికవర్గం పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు, ఆంధ్ర రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికులకు జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని ఇసుక కొరత కారణాలతో గత రెండు సంవత్సరాలుగా పనిలేక అనేక ఇబ్బందులకు గురైన భవన నిర్మాణ కార్మికులకు 10 వేల చొప్పున ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం మాట తప్పిందని తక్షణమే ఆర్థిక సాయం ప్రకటించాలని భవన నిర్మాణ కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని సిఐటియు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో భవన నిర్మాణం కార్మిక సంఘం అధ్యక్షులు రాంచందర్ కార్యదర్శి సత్తిబాబు నాయకులు సోమినాయుడు సింహాచలం తదితరులు పాల్గొన్నారు

# బద్వేలు పింఛన్దారుల సంగం అధ్యక్షుడు మృతి

బద్వేలు ( విభారె) బద్వేలు పింఛన్దారుల సంఘం అధ్యక్షుడు ఏ రామారెడ్డి (83) సోమవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు గతంలో ఈయనబద్వేలు బి.కోడూరు మండలాలకు అభివృద్ధి అధికారి గా పని చేశారు గత కొంత కాలంగా ఆయన పింఛన్దారుల సంఘానికి అధ్యక్షుడుగా వ్యవహరిస్తున్నారు ఆయన అధ్యక్షుడుగా ఎన్నికైన తర్వాత సంఘం ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు జరిపించారు రామారెడ్డి మృతి పట్ల పింఛన్దారులు పలు శాఖల ప్రభుత్వ ఉద్యోగులు సన్నిహితులు స్నేహితులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు

# టైలర్ల అభివృద్ధి కొరకు కృషి చేస్తా...



## జిల్లా టైలర్ల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర రెడ్డి
## లక్షల విలువ చేసే స్థలాన్ని అసోసియేషన్ భవనానికి విరాళం
## కర్నూలు జిల్లా టైలర్ల సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన బొల్లవానిపల్లె వెంకటేశ్వర రెడ్డి

తుగ్గలి( విభారె) : కర్నూలు జిల్లా టైలర్ల సంఘం అధ్యక్షుడిగా తుగ్గలి మండల పరిధిలోని గల బొల్లవాని పల్లె గ్రామానికి చెందిన వెంకటేశ్వర రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా ఆదివారం రోజున పత్తికొండ డివిజన్ పరిధిలోని గల టైలర్లందరూ జిల్లా అధ్యక్షునిగా ఎన్నికైన వెంకటేష్ రెడ్డి కు శాలువా కప్పి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా సన్మాన గ్రహీత వెంకటేష్ రెడ్డి మాట్లాడుతూ కర్నూలు జిల్లా టైలర్ల సంఘం అధ్యక్షులుగా తనను ఎన్నుకున్నందుకు జిల్లా టైలర్ల సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. తనపై నమ్మకం ఉంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు టైలర్ల అభివృద్ధి కొరకు తన వంతు కృషి చేస్తానని ఆయన తెలియజేశారు. పత్తికొండలోని ఉరుకుంద ఈరన్న స్వామి గుడి ఎదురుగా ఉన్న 10 లక్షలు విలువ చేసే 6 సెంట్ల తన సొంత స్థలాన్ని కర్నూలు జిల్లా టైలర్ అసోసియేషన్ కమ్యూనిటీ భవనానికి విరాళంగా ఇస్తున్నట్లు సవాముఖంగా తెలియజేశారు. టైలర్ల అభివృద్ధి కొరకు మరియు టైలర్ల సమస్యల పరిష్కారం కొరకు ఎల్లప్పుడూ తన వంతు కృషి చేస్తానని ఆయన తెలియజేశారు. ఈ సందర్భంగా పత్తికొండ డివిజన్ టైలర్లందరూ విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద ఉన్న టైలర్ల అసోసియేషన్ ఆఫీస్ వద్ద భోజన సదుపాయాలను ఏర్పాటుచేశారు.ఈ సందర్భంగా పత్తికొండ డివిజన్ పరిధిలోని టైలర్లు మాట్లాడుతూ టైలర్ల సమస్యల పరిష్కారం కొరకు వెంకటేష్ రెడ్డి ఎల్లప్పుడు ముందు ఉంటారని, కరోనా సమయంలో ఎంతోమందికి సహాయం చేసి ఆదుకున్నారని వారు తెలియజేశారు. వెంకటేష్ రెడ్డి ను జిల్లా అధ్యక్షులుగా ఎన్నుకోవడం చాలా సంతోషకరమైన వారు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పత్తికొండ డివిజన్ పరిధిలోని గల టైలర్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పార్లమెంట్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలి-ఎమ్మార్పీఎస్

## ఎమ్మార్పీఎస్ 6వ రోజు నిరాహార దీక్షకు - టిడిపి మద్దతు..
## సభలో మాట్లాడుతున్న బత్తిన లోకనాథ్..



పత్తికొండ పత్తికొండ మండలం ఎమ్మార్వో కార్యాలయం ఎదుట నాలుగు స్తంబాల దగ్గర మంద కృష్ణమాదిగ ఆదేశాల మేరకు నేడు ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాలు ఏర్పాటు చేసిన 6వ రిలే నిరాహారా దీక్షలో ఎమ్మార్పీఎస్, ఎంపిఎస్ నాయకులు, వాల్మీకి రామాలయ కమిటీ చైర్మన్ శివశంకర్ నాయుడు, ఉప్పర బాలస్వామి, సుధ, ఓంకార్ తదితరులు పుల మాలలు వేసి వారికి మద్దతు గా మేము ఉంటామని తెలుగుదేశంపార్టీ నాయకులు. టిఎన్టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశోక్, బత్తిన లోకనాథ్, మనోహర్ చౌదరి, కడవల సుధాకర్, విజయ్ మోహన్ రెడ్డి, టిడిపి కార్యకర్తలు పాల్గొని మద్దతుప్రకటిస్తూ ఎస్సీ వర్గీకరణ సాధించేంతవరకు ఎమ్మార్పీఎస్ పోరాటంలో టిడిపి భాగస్వామ్యం ప్రత్యక్షంగా పాల్గొంటుందని ఈ సందర్భంగా హామీ ఇస్తూ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమం లో ఎంపీఎస్ రాష్ట్ర నాయకులు సుభాష్ చంద్ర మాదిగ, ఎస్.వెంకటేశ్వర్లు మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా కో-కన్వీనర్ రవికుమార్ మాదిగ పాల్గొన్నారు. దీక్షలో వారు మాట్లాడుతూ బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగంలో కల్పించిన రిజర్వేషన్ ఫలాలు అందరికీ సమానంగా దక్కాలంటే ఎస్సీ వర్గీకరణ జరిగి తీరాలన్నారు. ఎస్సీ వర్గీకరణపైనే మాదిగల సమగ్ర అభివృద్ధి ఆధారపడి ఉందన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం 28 సంవత్సరాలుగా కృష్ణ మాదిగ నాయకత్వంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఉద్యమాలు చేస్తున్నామన్నారు. ఇప్పటికైనా న్యాయబద్ధమైన ఎస్సీ వర్గీకరణ బిల్లును తక్షణం పార్లమెంటులో ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీక్ష కార్యక్రమంలో ఎంపీఎస్ జిల్లా నాయకులు రాముడు మాదిగ, తిరుపాల్ మాదిగ, రామాంజినేయులు మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా కో-కన్వీనర్ జె.రవికుమార్,అముదాల రంగస్వామి, ఆరేకంటి అంజి తదితరుల పాల్గొన్నారు.

# విద్యార్థులకు శాపంగా మారిన జీవో నెంబర్ 117 ను రద్దు చేయాలి

## డి ఎస్ ఎఫ్ డిమాండ్

ఎమ్మిగనూరు, ఎమ్మెల్యే పట్టణంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 3,4,5 తరగతుల విలీన ప్రక్రియను వెంటనే వెనక్కి తీసుకోవాలని డి ఎస్ ఎఫ్ ఆధ్వర్యంలో ఎమ్మిగనూరు తాసిల్దార్ జయన్న గారికి స్పందన కార్యక్రమంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గ సభ్యులు నరసింహ, తాలూకా కార్యదర్శి వీర ప్రతాప్ మాట్లాడుతూ తరగతులను విలీనం చేయడం ద్వారా చిన్నారుల రాకపోకలకు ఇబ్బంది కలిగి వారికి



సమస్యలు ఏర్పడతాయని అన్నారు. ప్రభుత్వం ఉన్నది విద్యార్థుల సమస్యలు తీర్చడానికి కానీ, ఈ ప్రభుత్వం మాత్రం విద్యార్థులకు లేని సమస్యలు సృష్టిస్తుందని వారు అన్నారు. పాఠశాలలను విలీనం చేయడం ద్వారా పేద విద్యార్థులు విద్యకు దూరం అవుతారని అన్నారు. సామాన్య విద్యార్థులు చదువుకు దూరం అవుతారని వారు ప్రభుత్వంపై మండిపడ్డారు. ఇటువంటి చర్యల ద్వారా రాష్ట్ర బాల కార్మికుల శాతం రేటు పెరుగుతుందని అన్నారు.ఈ తరగతుల విలీనాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని లేకపోతే విద్యార్థి సంఘాలతో, విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి ఉద్యమాలు చేస్తాం అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డి ఎస్ ఎఫ్ నాయకులు రాజు, అర్జున్ ,వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు

# ఆగస్టు మొదటి వారంలో తల్లిపాలు వార్షికోత్సవాలు

సిద్ధవటం ( కడప జిల్లా రాజంపేట నియోజర్గం సిద్ధవటం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో డాక్టర్ శిరీష( గైనకాలజిస్ట్ ) మీడియా పరంగా మాట్లాడుతూ ఆగస్టు మొదటి వారంలో తల్లిపాలు వార్షికోత్సవాలు జరుగుతాయని డెలివరీ అయిన ఆరు నెలల వరకు బిడ్డకు తల్లిపాలు శ్రేష్టం అని డాక్టర్ శిరీష పేర్కొన్నారు బిడ్డ ఎదుగుదల అవయవాలు పెరుగుదల ఇమ్యూనిటీ హెల్త్ తల్లిపాలు బిడ్డకు శ్రేష్టం అని వైద్యాధికారి శిరీష తెలియజేశారు



# ఏంటి శ్రుతీ.. ఇకనైనా వారిని వదిలేస్తావా?



లోకనాయకుడు సీనియర్ స్టార్ హీరో కమల్ హాసన్ కుమార్తెగా సినీ గడప తొక్కిన శ్రుతి హాసన్.. 'లక్' అనే హిందీ మూవీతో హీరోయిన్ గా కెరీర్ ను స్టార్ట్ చేసింది. ఈ మూవీ అనుకున్నంతగా విజయం సాధించలేకపోయింది. ఆ తర్వాత శ్రుతి హాసన్ తమిళ్ తెలుగు భాషల్లో వరుస సినిమాలు చేసింది. కానీ అవన్నీ బాక్సాఫీస్ వద్ద బోల్తా పడటంతో.. శ్రుతి హాసన్ పై ఐరన్ లెగ్ అనే ముద్ర వేసి ట్రోల్ చేశారు.ఇక హీరోయిన్ గా శ్రుతి హాసన్ కెరీర్ కష్టమే అనుకుంటున్న తరుణంలో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సరసన 'గబ్బర్ సింగ్' మూవీ చేసి సక్సెస్ ట్రాక్ ఎక్కింది. ఈ మూవీ అనంతరం టాలీవుడ్ లో అల్లు అర్జున్ ఎన్టీఆర్ మహేష్ బాబు రామ్ చరణ్ వంటి స్టార్ హీరోలతో జతకట్టి.. ఇక్కడ మంచి గుర్తింపు సంపాదించుకుంది. కెరీర్ ఊపందుకుంటున్న సమయంలో బ్రేకప్ కారణంగా కొన్నాళ్లు సినిమాలకు దూరమైంది.2015లో రిలీజ్ అయిన సూపర్ హిట్ మూవీ 'శ్రీమంతుడు'లో చివరిగా మెరిసిన శ్రుతి హాసన్.. దాదాపు ఐదేళ్లు కనిపించలేదు. అయితే మళ్లీ 'క్రాక్' వంటి బ్లాక్ బస్టర్ తో కంబ్యాక్ ఇచ్చిన ఆమె.. ఆ వెంటనే 'వకీల్ సాబ్'తో మరో హిట్ ను ఖాతాలో వేసుకుంది. ప్రస్తుతం ఈ బ్యూటీ సీనియల్ హీరోలతో నటించేందుకు ఎక్కువగా సై అంటోంది. ఈమె ఇప్పుడు పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ కు జోడీగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో 'సలార్' అనే మూవీ చేస్తోంది.అలాగే నటసింహం నందమూరి బాలకృష్ణతో 'ఎన్బీకే 107'లో నటిస్తోంది. గోపీచంద్ మలినేని తెరకెక్కిస్తున్న మాస్ ఎంటర్టైనర్ మూవీ ఇది. మరోవైపు యంగ్ డైరెక్టర్ బాబీ మెగాస్టార్ చిరంజీవి కాంబినేషన్ లో రూపుదిద్దుకుంటున్న 'మెగా 154'లోనూ శ్రుతీ హీరోయిన్ గా ఖాయమైంది. ఇటీవల కాలంలో సీనియర్ హీరోలకు హీరోయిన్ల కొరత ఏ స్థాయిలో ఉందో ప్రత్యేకంగా వివరించి చెప్పక్కర్లేదు. నిర్మాతలు సీనియర్ హీరోల కోసం భారీ రెమ్యునరేషన్ ఇచ్చి మరీ హీరోయిన్లను తీసుకొస్తున్నారు.ఈ నేపథ్యంలోనే సీనియర్ హీరోలతో శ్రుతి హాసన్ జతకట్టేందుకు మొగ్గు చూపుతుందని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఏదేమైనా ఆకట్టుకునే అందం టాలెంట్ మంచి సక్సెస్ రేటు ఉన్నప్పటికీ.. శ్రుతి హాసన్ యంగ్ హీరోలతో కాకుండా సీనియర్ హీరోలతో కలిసి నటించడం ఆమె అభిమానులు ఏ మాత్రం జీర్ణించుకోలేకపోతున్నారు.ఇలానే తన నాన్న వయసు ఉన్న హీరోలతో జతకటడం కంటిన్యూ చేస్తే శ్రుతి క్రేజ్ కు గట్టి దెబ్బ పడటం ఖాయమని.. యంగ్ స్టార్స్ నుండి ఆఫర్లు తగ్గే అవకాశాలు అత్యధికంగా ఉంటాయని అభిమానులు కలవర పడుతున్నారు. మరి ఇకనైనా శ్రుతి హాసన్ సీనియర్ హీరోలను వదిలేస్తుందో..లేదో..చూడాలి.

# సమంత అందం గురించి బాలీవుడ్ స్టార్ హీరో కామెంట్



సౌత్ లో స్టార్ హీరోయిన్ గా నిలిచిన ముద్దుగుమ్మ సమంత ఇప్పుడు బాలీవుడ్ లో జెండా పాతేందుకు ప్రయత్నాలు చేస్తోంది. అందులో భాగంగానే హీరోయిన్ గా ఈ అమ్మడు హిందీలో సినిమాలు మరియు వెబ్ సిరీస్ లు చేస్తూ బిజీ బిజీగా ఉంది. నటిగా సమంత బాలీవుడ్ లో పరిచయాలు పెంచుకుంటూ వరుసగా ఆఫర్లు దక్కించుకునే ప్రయత్నం చేస్తోంది.ఒక్కసారి సమంత తో వర్క్ చేసిన ఏ స్టార్ అయినా ఆమె గురించి పాజిటివ్ గా స్పందించడం కామన్ విషయం. సమంత గురించి కూడా చాలా మంది స్టార్ హీరోలు పాజిటివ్ గా మాట్లాడటం మనం విన్నాం.. చూశాం. ఇప్పుడు ఆ జాబితాలో బాలీవుడ్ స్టార్ హీరో రణ్వీర్ సింగ్ చేరాడు. ఈయన తాజా ఇంటర్వ్యూలో ప్రత్యేకంగా సమంత గురించి.. ఆమె అందం గురించి మాట్లాడటంతో ఆ వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి.తాజా ఇంటర్వ్యూలో రణ్వీర్ సింగ్ మాట్లాడుతూ.. సమంత తో తాను గతంలో ఒక యాడ్ లో నటించాను. భవిష్యత్తులో కూడా ఆమెతో మరిన్ని ప్రాజెక్ట్ ల్లో కలిసి నటించాలని కోరుకుంటున్నాను. ఆమె ప్రతిభ కలిగిన వ్యక్తి మాత్రమే కాకుండా అందమైన వ్యక్తి. యాడ్ చేసే సమయంలోనే మొదటి సారి మేము ఇద్దరం కలిశాం.. ఆ సమయంలో మా ఇద్దరికీ పరిచయం అయ్యింది.సమంత ను ఒక నటిగా.. వ్యక్తిగా అభిమానిస్తాను. ఆమెతో కలిసి నటించే వారితో.. ఆమె చుట్టూ ఉన్న వారితో కలిసి పోయి వారితో సరదాగా ఉంటుంది. ప్రతి ఒక్కరితో కూడా ఒకే విధంగా మాట్లాడే తత్వం నాకు నచ్చింది. ఆమెతో భవిష్యత్తులో పూర్తి స్థాయి సినిమా ను చేసే విషయమై ఆలోచిస్తున్నట్లుగా చెప్పుకొచ్చాడు.సమంత బాలీవుడ్ లో ప్రయత్నాలు చేస్తున్న ఈ సమయంలో రణ్వీర్ సింగ్ ఇలాంటి ప్రకటన చేయడంతో ఆమె కెరీర్ భవిష్యత్తులో బాలీవుడ్ లో వెలిగి పోవడం ఖాయం అనిపిస్తుంది అంటూ ఇండస్ట్రీ వర్గాల వారు మరియు మీడియా సర్కిల్స్ వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# ది వారియర్.. ఈ దూకుడు బాక్సాఫీస్ వద్ద ఉంటే బాగుండేది

ఎనర్జిటిక్ స్టార్ రామ్ హీరోగా ఉప్పెన బ్యూటీ కృతి శెట్టి హీరోయిన్ గా నటించిన చిత్రం ది వారియర్ ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెల్సిందే. బాక్సాఫీస్ వద్ద ఈ సినిమా బొక్క బోర్లా పడింది. యాభై కోట్లకు పైగానే ఈ సినిమా కు ఖర్చు చేశారని.. ప్రీ రిలీజ్ బిజినెస్ కూడా బాగానే




అయ్యిందంటూ విడుదలకు ముందు లెక్కలతో మతులు పోగొట్టినంత పని చేశారు.విడుదల తర్వాత వచ్చిన కలెక్షన్స్ కు యూనిట్ సభ్యుల మతులు పోయి ఉంటాయి అది వేరే విషయం. ఇంత విచారకర సమయంలో కూడా వారికి ఒక విషయం ఆనందం కలిగించే విధంగా ఉంది. అదే బుల్లెట్ బండి. సినిమా విడుదల అవ్వక ముందు నుంచే ఈ పాట తెగ హడావిడి చేసింది.. ఇంకా చేస్తూనే ఉంది. ఈ పాటకు ఏకంగా వంద మిలియన్ల వ్యూస్ వచ్చాయి. ఒక మిలియన్ లైక్స్ కూడా దక్కించుకుంది.యూట్యూబ్ లో బుల్లెట్ సాంగ్ ను తెగ స్ట్రీమింగ్ చేస్తున్నారు. కేవలం ఆదిత్య మ్యూజిక్ యూట్యూబ్ ఛానల్ లో వంద మిలియన్ల మంది చూసి ఉంటే.. ఇతర ప్లాట్ ఫామ్స్ పై చూసిన వారు.. వింటున్న వారు ఎంత మందో అర్థం చేసుకోవచ్చు. బుల్లెట్ సాంగ్ సోషల్ మీడియాలో ముఖ్యంగా ఇన్ స్టాగ్రామ్ లో లక్షల్లో రీల్స్ గా వచ్చిన విషయం కూడా తెలిసిందే.ఈ పాటకు వచ్చిన రెస్పాన్స్ లో కనీసం 25 శాతం సినిమా కి వచ్చి ఉంటే వసూళ్లు భారీగా ఉండేవి.. బయ్యర్లకు మరియు నిర్మాతలకు ఈ బాధలు ఉండేవి కాదు అనేది సోషల్ మీడియా టాక్. యూట్యూబ్ లో బుల్లెట్ పాట దూకుడు చూపించినట్లుగా ది వారియర్ బాక్సాఫీస్ వద్ద దూకుడు చూపించి ఉంటే వసూళ్లు రికార్డు స్థాయి లో ఉండేవని రామ్ అభిమానులు చర్చించుకుంటున్నారు.రామ్ మరియు కృతి శెట్టిల యొక్క డాన్స్ కు మరియు వారి యొక్క స్టైల్ కు ప్రతి ఒక్కరు ఫిదా అవుతున్నారు. కృతి శెట్టి కి ఈ సినిమా ఫ్లాప్ అయినా కూడా బుల్లెట్ సాంగ్ ఒక్కటి ఆమె స్టార్ డమ్ ను మరింతగా పెంచేందుకు ఉపయోగపడింది అంటూ ఇండస్ట్రీ వర్గాల వారు అంటున్నారు.వయసులో చిన్నే అయినా కూడా కృతి వేసిన డాన్స్ స్టెప్పులకు ప్రతి ఒక్కరు ఫిదా అవుతున్నారు. అందుకే ఈ స్థాయి వ్యూస్ వస్తున్నాయని అంటున్నారు. దూకుడు చూస్తూ ఉంటే ఈ పాట ముందు ముందు మరిన్ని వందల మిలియన్ ల వ్యూస్ ను దక్కించుకున్న ఆశ్చర్యం లేదని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు.

# అంతర్గత విభేదాలు.. వెస్టిండీస్ స్టార్ ఆల్‌రౌండర్ సంచలన నిర్ణయం!




వెస్టిండీస్ మహిళల క్రికెట్ జట్టు స్టార్ ఆల్‌రౌండర్ డియాంద్రా డాటిన్ సంచలన నిర్ణయం తీసుకుంది. డాటిన్ అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించింది. డాటిన్ తన నిర్ణయాన్ని సోషల్ మీడియా వేదికగా సోమవారం ప్రకటించింది. కాగా జట్టులో అంతర్గత విభేదాలు వల్ల డాటిన్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే అంతర్జాతీయ క్రికెట్ నుంచి తప్పుకున్న ఆమె దేశవాళీ క్రికెట్‌లో మాత్రం కొనసాగనున్నట్లు తెలిపింది. "14 ఏళ్ల నా అంతర్జాతీయ కెరీర్‌లో నాకు మద్దతుగా నిలిచిన వెస్టిండీస్ క్రికెట్‌కు, అభిమానులకు ధన్యవాదాలు.నేను చాలా ఆలోచించి ఈ నిర్ణయం తీసుకున్నాను. ఇకపై ప్రపంచ వ్యాప్తంగా దేశవాళీ క్రికెట్ ఆడేందుకు నేను ఎదురుచూస్తున్నాను" అని ట్విటర్‌లో డాటిన్ పేర్కొంది. కాగా డాటిన్ ప్రస్తుతం కామన్ వెల్త్‌గేమ్స్‌లో బార్బడోస్ జట్టు తరపున ఆడుతోంది. కామన్ వెల్త్‌గేమ్స్‌లో భాగంగా ఆగస్ట్ 3న భారత్ మహిళల జట్టుతో బార్బడోస్ తలపడనుంది.అయితే డాటిన్ ఈ మ్యాచ్‌కు ముందు రిటైర్మెంట్ ప్రకటించడం బార్బడోస్‌కు గట్టి ఎదురుదెబ్బ అనే చెప్పుకోవాలి. ఇక 2008లో డాటిన్ విండీస్ తరపున అంతర్జాతీయ అరంగేట్రం చేసింది. ఇప్పటి వరకు తన అంతర్జాతీయ కెరీర్‌లో 146 వన్డేలు, 126 టీ20ల్లో విండీస్‌కు ప్రాతినిధ్యం వహించింది. అదే విధంగా తొలి టీ20 ప్రపంచకప్ గెలిచిన విండీస్ జట్టులో డాటిన్ భాగంగా ఉంది.

## ఎవరికి ఎలా బౌలింగ్ చేయాలో అతడికి బాగా తెలుసు: భువీ ప్రశంసలు

చివబబి ఎనిటతివబ లబ ఎనిటతిజీ, 2నిట ౨20ఎ: టీమిండియా యువ బౌలర్ అర్ష్‌దీప్ సింగ్‌పై సహచర ఆటగాడు, సీనియర్ పేసర్ భువనేశ్వర్ ప్రశంసలు కురిపించాడు. ఏ బ్యాటర్‌కు ఎలా బౌలింగ్ చేయాలో అతడికి బాగా తెలుసన్నాడు. యువ ఆటగాళ్లలో చాలా తక్కువ మందిలో మాత్రమే ఇలాంటి పరిణతి ఉంటుందంటూ అర్ష్‌దీప్‌ను కొనియాడాడు. కాగా ఐపీఎల్-2022లో పంజాబ్ కింగ్స్‌కు ప్రాతినిథ్యం వహించిన అర్ష్‌దీప్ అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్న విషయం తెలిసిందే.పంజాబ్‌కు ఆడిన ఈ 23 ఏళ్ల ఫాస్ట్‌బౌలర్ 14 ఇన్నింగ్స్‌లో 10 వికెట్లు పడగొట్టాడు. ఈ క్రమంలో బీసీసీఐ నుంచి పిలుపు అందుకున్న అర్ష్‌దీప్.. ఇంగ్లండ్ పర్యటనలో భాగంగా టీ20 సిరీస్‌తో అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టాడు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**